


సంపుటం : ౯. విక్రమ, పుష్యము : జనవరి, 1941. సంచిక : ౮.

శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడుగారు

శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడుగారు పశ్చిమగోదావరి మండలములోని ధనికప్రముఖులలో ఒకరు.

ధనధాన్యసమృద్ధమైన పశ్చిమ గోదావరి మండలమున అట్టి ధనవంతులు మఱిఎందఱో ఉన్నారు.

ఐనను వారి అందఱిలో లక్ష్మయ్యనాయుడుగారి పేరు వీను మిగిలినది.

కారణమేమి ?

వారివద్ద విత్తమునకు తగిన వితరణ ఉండుటచేతనే.

వారు కావ్యగీతి ప్రియులు, ఆంధ్రభాషాభిమానులు, ఉచితజ్ఞత, ఉదారత వారికి వెన్నంటి వచ్చిన సుగుణములు.

వారు ఎన్నో గ్రంథమాలలకు హస్తావలంబన మిచ్చినారు; ఎన్నో పత్రికలకు చేయూత నిచ్చినారు, స్వయముగ పత్రికను నిర్వహించినారు. గ్రంథములను కృతినందినారు. కవిమిత్రులై నెగడినారు. కావుననే వారికి 'కవికులాలంకార' అను బిరుదము ప్రసాదితమైనది,

అట్టివారు గతవత్సరపు డిశంబరు తుదివారములో తమ స్వస్థలమైన పెనుగొండలో ఉపాధ్యాయ పండిత పరిషత్తునకు ఆహ్వాన సంఘాధ్యక్షులై వేల యెఱుగని తమ భాషాభిమానమును, అవధిలేనితమ పండిత పక్షపాతమును మఱియొకసారి లోకమునకు చాటియున్నారు.

పశ్చిమగోదావరి మండలములో పెనుగొండ యొక పీఠీ గ్రామము. ఆ పీఠీగ్రామమునందలి ప్రజాహిత జీవనమున కంతకును నాయుడుగారే పట్టుసారువ.

తమ కాపురపు కాణాచి, తమ కార్యక్షేత్రము ఐన పెనుగొండకు ఉపాధ్యాయ పండిత పరిషత్తును ఆహ్వానించి ఘనమైన స్వాగతము చేసి జయప్రదముగా నిర్వహించినారు.

ఇక స్వాగతోపన్యాసములో వారు వెలిబుచ్చినఅభిప్రాయములు వారి పండితపక్షపాతమునకు సాక్షీభూతములై ఉన్నవి. ఈ వాక్యమును తిలకింపుడు:

"జ్ఞానదాతలై సభ్యప్రపంచమున అగ్రస్థాన మలంకరించిన మిమ్ము నే డిచటికి ఆహ్వానించి కొలదికాలమైనను తమ ఉత్తమసాంగత్యమును పొందు సదవకాశమును నాకు ఆదరణాభిమానపూర్వకముగ కలుగచేసినందులకు భాషాసేవాభిరతుడనగు నే నెంతయు మీకు కృతజ్ఞుడను."

ఉపాధ్యాయపండితులు శ్రమకు తగిన వేతనము బడయక పోవుటచేతనే భాషావ్యాప్తి నీరసించుటకు హేతువైనదని వారు నిజ మరసినారు.

మన మహారాజులు, జమీందారులు మన విద్యలను ఏనాడు పోషించుట మానిరో ఆనాటనే మన క్షీణదశ ప్రారంభమైనదని నాయుడుగారు చింతించినారు.

ఉన్నతపదవీవ్యామోహితులై భాషాభిమానమును తెగనాడిన పెద్దలను వారా రా ఉపన్యాసమున లెస్సగ నధిక్షేపించిరి.

నాయుడుగారి వంటి భాషాప్రియులు ఒక్కొక్క మండలమునకు పదిమంది వంతున ఉండుచో ఆంధ్ర భాష అచిరకాలముననే అభ్యున్నతి నందగలదు.

మహారాష్ట్ర, మాళవ దేశాల్లో
సంక్రాంతిమహాపర్వం

సంక్రాంతి వ్రతం ఉత్కృష్ట సంతాన ప్రదాయిని—
చిమ్మిలి ముద్దలు పంచిపెట్టే ఆచారకాండ—
నువ్వ పప్పుతో చేసిన భక్ష్యాల ప్రాధాన్యత—
నువ్వులునూరి చేసిన ముద్దతో ఒంటికి నలుగు—

మహారాష్ట్రంలో

మకరరాసిలో సూర్యుడు ప్రవేశించే దినం మకరసంక్రాంతి. ఈనాటినుంచి సూర్యుడు కర్కాటకరాశిలో ప్రవేశించే వరకు ఉత్తరాయణం. కర్కాటరాశిలో సూర్యుడు ప్రవేశించింది మొదలు మకర సంక్రాంతివరకు దక్షిణాయనము.

ఉత్తరాయణం

ఉత్తరాయణము పుణ్యకాలమనీ, దక్షిణాయనము అంత మంచిదికాదనీ అంటారు. వివాహాలు, ఉపనయనాలు సాధారణంగా ఉత్తరాయణంలోనే చేస్తారు. ఉత్తరాయణంలో చనిపోయిన వారు వెంటనే స్వర్గలోకంలోకి వెళ్ళిపోతారు. దక్షిణాయనంలో చనిపోయే వారు ఉత్తరాయణం వచ్చేవరకు స్వర్గ ద్వారాలవద్ద వేచివుండాలి. కాగా ఉత్తరాయణపుణ్యకాలంలో మరణం పుణ్యాత్ములకే కాని లభించదంటారు.

ప్రాచీనమైంది

మకర సంక్రాంతిపర్వం అతి పురాతనమైందిగా కనిపిస్తుంది.

పూర్వకాలంలో గుణవంతురాలు, పతివ్రతఐన కృపి అనే స్త్రీ వుండేది. ఋషితుల్యుడైన ద్రోణాచార్యులభార్య ఆమె. ఆ భార్యాభర్తలు ఒక ఆశ్రమంలో వుంటూవుండేవారు.

ఒకనాడు ద్రోణాచార్యుడు బయటికి వెళ్లాడు. ఆశ్రమంలో కృపి ఒక్కర్తే కూచునివుంది. ఆసమయంలో దుర్వాసముని సమిధలకొరకు అన్వేషణ సాగిస్తూ అచ్చటికి వచ్చాడు. వచ్చిన మునిని కృపి పూజించింది. తమ పేదతనాన్ని చెప్పుకుంది. ఒక ముసలి ఆవు తప్ప తమకు ప్రపంచంలో ఏమీ ఆస్తిలేదని చెప్పుకుంది. తమకు పిల్లలుకూడా లేరని చెప్పుకుంది. తమకు భాగ్యప్రదమైన సాధన మేదేనా చూపించమని కోరింది.

పెరుగుదానం

ఆమె ప్రార్థనావ్యధూక్తులకు ముని దయార్ద్రహృదయుడై సంక్రాంతి పర్వాన్ని జరుపమని ఉపదేశించాడు.

సంక్రాంతినాడు గంగానదిలో స్నానంచేసి బ్రాహ్మడికి పెరుగుదానం చేయాలి. నందుని భార్యఐన యశోద ఇట్లే బ్రాహ్మడికి పెరుగుదానంచేసింది. ఆ దానానికి ఫలితంగానే ఆమెకు శ్రీకృష్ణుడు కొడుకుగా లభించాడు. ఆ కొడుకు వారి పేదతనాన్ని బాపి తన తండ్రిఐన నందుని గొల్లకులానికి రాజుని చేశాడు.

ఈసంగతులన్నీ చెప్పి ఆమీదట ఋషి కృపితో ఆనాడే మకరసంక్రాంతి అనే సంగతి జ్ఞాపకంచేశాడు. వెంటనే దగ్గరవున్న నదికి వెళ్ళి శరీరానికి నువ్వుల పిండి రాసుకుని స్నానంచేసి రమ్మన్నాడు. వచ్చి తనకు పెరుగుదానం చెయ్యమన్నాడు. తనకు ఆకలిగావుందనీ, ఆమె అదృష్టవశంచేత ఆనాడు తాను అక్కడికి వచ్చాననీ చెప్పాడు

సత్సంతానప్రాప్తి

అట్లా దానంచేయడంవల్ల ఆమెకు చక్కని కొడుకు పుడతాడనీ, అతడు తండ్రియొక్క మూడు విధాలయిన ఋణాలు తీరుస్తాడనీ చెప్పాడు.

అందుమీద కృపి దుర్వాసుడు చెప్పినట్లు చేసింది. కాలక్రమాన్ని ఆమెకు ఒక చక్కని కొడుకుపుట్టాడు. అతడే అశ్వత్థామ. ఆకొడుకు పుట్టినప్పటినుంచి కృపి ఎట్టి చీకు, చింతా లేకుండా వుండేది.

బొంబాయిలో బాక్ బేచెంత ఈనాటి దృశ్యం చూడటగివుంటుంది పురోహితుణ్ణి తీసుకుని వేలకొలదిమంది సముద్ర స్నానానిక వెళతారు. ఒంటికి నువ్వుల పిండి రాసుకుని శాస్త్రోక్తంగా సముద్ర స్నానం చేస్తారు. మంత్రం చెప్పిన బ్రాహ్మడికి దక్షిణఇవ్వడంతో ఆకార్యకలాపం ముగుస్తుంది.

చిమ్మిలి పంపకం

ఇంటికి వచ్చి వారు తిరిగ బ్రాహ్మల్ని ఆహ్వానించి నువ్వులతోనిండిన కంచు పాత్రలు వారికి దానంచేస్తారు. ఈపాత్రలకు తిలాపాత్రలని పేరు. ఈ తిలాపాత్రలతోబాటు యజమాని తాహతునిపట్టి దక్షిణకూడా ఇస్తారు. ఒకొక్కప్పుడు రాగిపాత్రలు, ఇత్తడి కుండెలు, గోడుగులు, ఇతరవస్తువులుకూడా బహుమానం చేస్తారు.

భోజనానికి మిత్రుల్ని, బంధువుల్ని ఆహ్వానిస్తారు. సాయంకాలం కొత్త బట్టలు ధరిస్తారు. స్త్రీలు నగలతో, నాణాలతో అలంకరించుకొంటారు. పంచదారలో నువ్వులుకలిపి తొక్కి అనగా చిమ్మిలిచేసి దానిని మిత్రులఇంట, బంధువుల ఇంట పంచిపెడతారు.

ఈచిమ్మిలి ముద్దలు పంచిపెట్టేటప్పుడు స్త్రీలు మిత్రురాండ్రతో, బంధువురాండ్రతో ఇట్లా అంటారు. "పంచదారతో కలపబడ్డ ఈనువ్వులగింజలు పుచ్చుకోండి. సంవత్సరం పొడుగునా మాకు స్నేహితులై వుండండి."

దూరప్రదేశాలలో వుండే స్నేహితులకు కూడా ఇది పంపక మానరు. ఒక చిన్న సంచీలో పంచదారతో కూడిన తిలలు వుంచి దానిని పోస్టులో దూరాన్నివున్న మిత్రులకు, బంధువులకు ఈ పండగ సందర్భంలో పంపుతారు. అట్లా పంపినవారు అవిపొందినవారికి ఆసంవత్సరం శుభప్రదమూ, సుఖప్రదమూ కావాలని కోరారని అర్థం.

మాళవదేశంలో

మాళవదేశంలో సంక్రాంతికి ముందు రోజున --మనభోగినాడు—ఇంటిళ్ళపాది తలంటి నీళ్లుపోసుకుంటారు. అందరూ కొత్తబట్టలు కట్టుకుంటారు. స్త్రీలు పాతగాజులు తీయించివేసి కొత్త గాజులు వేయించుకుంటారు.

మొదటితాంబూలం మొగుడికి

ఆనాటి సాయంకాలం స్త్రీలు ఐదు తాంబూలాలు పంచిపెడతారు. ఏడు తమలపాకులు; ఏడుపోకలు; చొప్పున లవంగాలు, జాజికాయ, జాపత్రి మొదలయినవి వేసి ఐదు తాంబూలాలు తయారుచేస్తారు. అందులో మొదటి తాంబూలం తమభర్తకి ఇస్తారు. మిగతా నాలుగు నలుగురు ముత్తైదువలకు ఇస్తారు. ఆనాటి పిండివంటల్లో నువ్వు పప్పు, బెల్లము ప్రధానమై వుంటాయి.

మర్నాడు అనగా సంక్రాంతినాడు కూడా అందరూ తలంటి పోసుకుంటారు. నువ్వులు ముద్దగానూరి దానిని ఒంటికి రుద్దుకోవడం ఈనాటి ముఖ్యవిషయాల్లో ఒకటి.

నువ్వులముద్దతో నలుగు

నువ్వులముద్దతో నలుగు పెట్టుకొని ఇంట్లో అందరూ తలంటి పోసుకున్న తరువాత పుణ్యస్త్రీలు చక్కగా అలంకరించుకొని ఐదు మట్టిముంతలు పుచ్చుకుని ఎరిగున్న పేరంటాళ్ళ ఇళ్ళకు వెళతారు.

ఒకొక్కముంతలో బియ్యము, పప్పుదినుసులు, కాబేజిముక్కలు, చెరుకుముక్కలు వుంచుతారు. ముంతమీది మూకుడు మూతలో బెల్లంపాకంలో నువ్వులు వేసి తయారుచేసిన ఉండలు వుంచుతారు.

ఒకొక్కఇంట్లో ఒకొక్క పిడతఇచ్చి ఆయింటిలోనుంచి మళ్ళీ అల్లాంటిదే ఒకొక్క పిడత పుచ్చుకుంటారు. ఎరిగివున్నవాళ్ళ అందరి ఇళ్ళల్లోనూ ఇల్లా మార్చుకున్న పిమ్మట ఆ స్త్రీలు ఇంటికి వచ్చివేస్తారు.

నువ్వులపప్పుతో భక్ష్యాలు

ఆనాడు బ్రాహ్మణ్ణి భోజనానికి పిలుస్తారు. నువ్వు పప్పుతో చేసిన లడ్లు ఆనాటి ప్రధాన భక్ష్యాలు. భోజనం అయిన తరువాత బ్రాహ్మడికి దక్షిణ ఇస్తారు.

కొత్త అల్లుణ్ణి ఈ పండక్కి తప్పకుండా తీసుకువస్తారు.

ఆనాటి మధ్యాహ్నం పేరంటాళ్లు ఒకచోట చేరతారు. చిన్నపిల్లల్ని పీటమీద కూర్చోపెట్టి వారి తలమీదనుంచి మిఠాయివుండలు, బటానీలు, రేగుపళ్లు మొదలయినవి దిగువారపోస్తారు.

అక్కడికి వచ్చిన స్త్రీలు వానిని ఏరుకుని ఇళ్ళకు తీసుకువెళతారు. వారు వెళ్ళిపోడానికి పూర్వం వారికి పసుపు కుంకుమలు, నువ్వు పప్పు ఇస్తారు.

తిలసంక్రాంతి

ఇందుతో ఈపండుగలో ముఖ్యమైన రెండవదినం ముగుస్తుంది.

ఎరిగివున్నవారికి నువ్వు పప్పు పంచిపెట్టడం ఇంటిలో అందరికీ ఈనాడు ప్రధానకర్తవ్యం. ఇంటిలో మగవారందరూ తమకంటె పెద్దలైన స్త్రీపురుషుల నుండి నువ్వు పప్పు పొంది దానిని తమకంటె చిన్నవారికి పంచిపెట్టాలి. భార్య ఈనాడు స్వయంగా భర్తకు నువ్వుపప్పు ఈయాలి.

మాళవదేశీయుల సంక్రాంతిలో నువ్వులకు (తిలలకు) ఇంత ప్రాముఖ్యం వుంది. కాబట్టే వారు ఈసంక్రాంతి పర్వాన్ని తిలసంక్రాంతి అని కూడా అంటారు.

వెన్నెల పాటలు

[వీనిని సేకరించినది శ్రీ దేవగుప్తాపు వెంకటరమణమూర్తి పంతులు గారు. వీనిని స్త్రీలు గుమికూడి వెన్నెలలో కూర్చుని పాడుకొంటారు. ప్రతి పాదానికి చివర 'వెన్నెలా' అని చేర్చుకని చదవాలి.]

అప్ప ఒంటికి తమ్ముడె వెన్నెలా
చుట్టమూయొచ్చెనే
బాగున్నావా తమ్ముడా
బాగున్నానే అప్ప
పగడాలు చెవ్వజోడు
పంచదిగాడీ
ముత్యాలు ముకకాలు
ముంజూటి నేశెనే
అద్దమూ బిల్లోంటి
అరుగుకొమ్మెక్కెనే ౧
దాహములు వేశెనే
దప్పికీయవె అప్ప
పచ్చన్న పచ్చన్న
పందిళ్ళ క్రిందనే ౨
పాపరావే పాప
నానల్ల పాపా
మీయమ్మ తమ్ముడనె
మీమేన మామనే
దాహములు వేసెనే
దప్పికీయవె పాప ౩
వారిదొడ్డి లున్నాది
గంగసారీ బావి
గంగశిరి సిగులూ
గరివిల్ల తోడనే ౪
ప్రొద్దోయి తీశేరు
బొల్లావుపాలే
సందపుడు తీశేరు
చారావు పాలే
యమకలను తీశేరు
యల్లావు పాలే

యీపాలు ఆపాలు
గూనల్లో పోశెనే ౫
అలికినా పొయ్యిలో
అగ్ని రాదేశెనే
నిమ్మపండూవంటి
నిప్పొక్కటేశెనే
నేరేడు పండోంటి
నీలాలు పోశెనే ౬
పొంగొచ్చినా పాలు
పొన్నపువ్వాఛాయ
ఉడుకొచ్చినా పాలు
ఉల్లిపువ్వా ఛాయ ౭
మొల్లాలు కుదుటికీ
మెల్లగా దించెనే
వారివద్దున్నాది
చిట్టి శ్రీముంతతో
ముత్తెమూ పాలల్లో
ముంచి యెత్తీనాది
ఏడుమ్మ పాలల్లో
ఎత్తిముంచీనాది ౮
ఇదిగోను ఓమామ
యిదవోయ్ ఓమామ
అందుకో ఓమామ
దాహ మందూకొమ్మి ౯
దరిమీద దించెనే
నీలాలు కళ్ళకే
నిండెనే నిద్దురలు
వాలారు కళ్ళకీ
వచ్చెనే నిద్దురలు ౧౦
అప్పరో మాయప్ప

మముగన్న అప్పవే
మంచమెయ్యే అప్ప
నాకు మంచామెయ్యి
పచ్చన్న పచ్చన్న
పందిళ్ళ క్రిందనే
పసుపుల్లు నూరేటి
పందిళ్ళ క్రిందనే ౧౧
నాముద్దు కూతురూ
నీ మేనకోడలూ
కంచాలుతోమేటి
కాంత కోడల్లోయి
ముంతలూ తోమేటి
ఉవిదకోడల్లోయి ౧౨
పాపరావే పాప
నాపాప రావే
మీఅమ్మ తమ్ముడనె
నీ మేనమామనే
మంచమెయ్యే పాప
మంచి మంచామెయ్యి ౧౩
ఏనుగుల సాలల్లో
వేతునోయి మామ
ఏనుగుల శబ్దాలు
రావే నిద్దురలూ
గుఱ్ఱాల సాలల్లో
వేతునోయి మామ
గుఱ్ఱాల శబ్దాలు
రావే నిద్దురలూ
దంపుళ్ళ సాలల్లో
వేతునోయి మామ
దంపుళ్ళ శబ్దాలు

రావే నిద్దురలు
ఏడుమేడల కొసను
గాలిమేడుందునే
వెయ్యే మంచములు
గాలిమేడల్లోను
మంచమేశిందోయి
గాలిమేడల్లోను ౪
మంచమేశిన పాప
మళ్ళిరాబోతేను
కుచ్చుల్ల కొంగొట్టి
కూర్చుండబెట్టినే
పయ్యాద కొంగొట్టి
పట్టి లాగినాడే ౧౫
మాఅమ్మ తమ్ముడా
మాకు మేనమామ
ఒదిలియ్యి ఓమామ
ఒదిలియ్యి కొంగులూ
ఒదలవోయి ఓమామ
నా చెంగు ఒదలవోయి
పిల్లులకి పాల్పోశి
మళ్ళీ వస్తాను
మళ్ళీ రాపోతేను
నాఅమ్మ తోడోయి
పిల్లులకి కూడోశి
మళ్ళీ వస్తాను
మళ్ళీ రాపోతేను
మాబాబు తోడోయి
కుక్కలకి కూడోశి
మళ్ళీ వస్తాను

[మిగతా ౧౩౬-వ పేజీలో

సూల్తాన్ రజియా

[గతసంచికతరువాయి.]

(చారిత్రక రూపకము)

రచయిత :

చాపరాల సత్యనారాయణమూర్తి, బి.యే.

౧౦-వ రంగము

(ఏకాంతప్రదేశము. రుక్నుద్దీన్—ఖాదర్—హుస్సేన్—మరి ఇతరులు సమావేశము. పిచ్చివానిని తీసికొనివచ్చుటకు రుక్నుద్దీన్ ఆజ్ఞపై హుస్సేన్ వెడలిపోవును—)

రుక్నుద్దీన్ :

(రీవి అభినయించుచు)- ఎన్ని చెప్పినను వినలేదు సుల్తానా. ఆఖరునకు రాంమోహిద్దీన్ మనచేతికి చిక్కినాడు. అల్లాహో అక్బరు. అల్లా మనయందే యున్నాడు. (వెకిలిగా నవ్వుచు). ఖాదర్-! నేను రాజునైనప్పుడు నీవు సేనానివి అయ్యెదవు కాదూ-!- హా- హా- (సంతోషమును పట్టలేక ఖాదర్ యొక్క కత్తిని ముద్దుపెట్టుకొనును)-

ఖాదర్ :

మీరిప్పుడే మహారాజులు. మీకు అడ్డమున్నదా...?

(ఇంతలో పిచ్చివాడు- హుస్సేన్‌వచ్చి, వారిని కలిసికొందురు)-

పిచ్చివాడు :

(వేగిరముగావచ్చి రుక్నుద్దీన్‌ను కౌగిలించుకొని)- ఓహో- మీరందరూ కార్యదక్షులు, గుండెకలవారు.

(తక్కినవారు హుర్రే, హుర్రే అందురు)- ఆ ఆకృతినిచూచి నిజముగా రాకొమరు లనుకొంటిని. ఆచోకీ చెప్పితిని. ఎంతపని—!

రుక్నుద్దీన్ :

వాడు రాంమోహిద్దీన్. మంత్రిజీ-! రాంమోహిద్దీన్‌ను ఈకత్తితో...అటు తరువాత సుల్తానా ఒప్పుకొనును.

పిచ్చివాడు :

అదికాదు కార్యము. ఇప్పుడే రజియానుకూడా బంధింపవలెను. ఆలస్యము తగదు. ప్రొద్దు క్రుంకపోవుచున్నది. ఆల్ట్‌మష్ వేషమును నేను ధరించెదను. భూతమనుకొని ప్రజలు సమీపించరు. సైనికుల వేషముధరించి మీరు రండి. గస్తీ తిరుగువారనుకొందురు మిమ్ములను ప్రజలు.

(రుక్నుద్దీన్ మోమునుచూచి) వీరిని ముగ్గురను బంధించినపిమ్మట—రుక్నుద్దీన్ మహారాజును సింహాసనముపై కూర్చుండపెట్టి—అటుపై వారిపని-

రుక్నుద్దీన్ :

(ఉబ్బి) ఇదిగో ఈపేద ఖడ్గమును కానుకగా స్వీకరించుడు.

ఇతరులు :

సుల్తాన్ సులైమన్ సంగతి ప్రజలలో ప్రచారమైనది. ముసల్మానులందరు మనవైపునకే తిరిగిరి.

పిచ్చివాడు :

అదియు మన కనుకూలమే. ఇక ఆలసించతగదు.

[యవనిక]

౧౧-వ రంగము

(సుల్తాన్ సులైమన్ రజియాకు సాయముచేయవచ్చి, ఢిల్లీకి అనతిదూరములో స్కంధావారమును నిలుపును. రాజకొటుకునై- అబ్దుల్ ఆలి, రుక్నుద్దీన్‌లు అతని గుడారముకడకు జని- అతనితో సంభాషింతురు)-

సులైమాన్ :

(గర్జించుచు)– మిమ్ములను యిప్పాటున బంధించిన మీరేమి చేయగలరు. ఒక్క వ్యక్తిపై ఇన్ని పన్నుగడలా–? స్త్రీని బంధించితిరి. మీకు హృదయములేదు. మీరు చెప్పునవి నాకు నచ్చవు.

రుక్నుద్దీన్ :

(అబ్దుల్ అలి మొగమువంక చూచి, సులైమాన్‌తో). అది కాదు. అల్లాసాక్షిగా చెప్పుచున్నాను. మనకు హిందువులకు సఖ్యతయా—! జనానాస్త్రీలకు పంట్లీయా—! హిందువులకు ముసల్మానులకు మధ్య వివాహములా–! ఘోషా అవసరములేదా––! ఇవి మన ప్రతిష్ఠకు భంగముకాదా––?

అబ్దుల్ అలి :

అంతేకాదు. మహమ్మదీయులను వెలికిద్రోసి, హిందువులను దగ్గరకు దీయుచున్నది.

రుక్నుద్దీన్ :

మహమ్మదీయ జాతిగౌరవమును, బెట్టును కాపాడవలవా పాలకులు...?

సులైమాన్ :

నేనువచ్చినది రజియాను విడిపించి, ప్రతీకక్షులను రూపుమాపుటకు–

అబ్దుల్ అలి :

(సులైమాన్ వంక తదేకదృష్టితో చూచుచు) మీరు మహాచక్రవర్తులు మీధాటికి సాటిలేదు. మీరు కత్తి యెత్తుచో– ఈభూమ్యాకాశములు– అంతేకాదు ఈ విశ్వప్రకృతియే చేయెత్తి వంగి సలాం చేయవలసినదే. మీరు తలపెట్టిన పనికి అల్లాకూడా ముదలసీయవలసినదే. మీపలుకులను కురాన్ గా వ్రాయవలసినదే.

(సులైమాన్‌లోని మార్పును కనిపెట్టుచు)–మీవంశమట్టిది. మీ కీర్తి అట్టిది.

సులైమాన్ :

(తలపంకించును)–

అబ్దుల్ అలి :

ఇదిగో కురాన్– దీనిపై చేయి పెట్టి చెప్పుచున్నాను. మన జాతి కత్తిలేని జాతి. మనఖ్యాతి ఖండాంతరములలో మారుమోగుచున్నది. అట్టి జాతికి మీరు మకుటము, అట్టి ఖ్యాతికి మీరు నిధానము మన జాతికి గురువైన చంద్రు డుదయించగనే సంద్రముపై హోరని రంకెలువైచుధ్వని మన జాతి కీర్తి గీతిగానము. దీనికంతకు మూలకందము మీప్రభావము.

సులైమాన్ :

(ఆలోచించుకొను చుండును)–

అబ్దుల్ అలి :

మీరు కన్నుగీటుచో దేశదేశములలోని స్త్రీలు– మోహనాకారులు– ఉబ్బి గంతులువైచుచు మిమ్ము నాశ్రయింతురు, మీరు కన్నెఱ్ఱచేయుచో ఖండఖండాంతర రాజ్యములు మీపాదసన్నిధికి పరుగులిడును.

మగవానిని లక్ష్యముచేయని, మగవాని సామర్థ్యమును గణించని... స్త్రీతో నేస్తమువలను ..

సులైమాన్ :

(మొగము చిట్లించుకొనును).

అబ్దుల్ అలి :

ఆపెకు హృదయములేదు. ఉండినను అది స్త్రీ హృదయము కాదు.

(అని రుక్నుద్దీన్ వంక చూచును.)

రుక్నుద్దీన్

హృదయము ..! ఒక్క హృదయమా ! రాంమోహిద్దీన్‌తో ఆమె ప్రవర్తన......!

అబ్దుల్ అలి :

(వెంటనే అందుకొని)– రాకుమారులు పలికినటుల ఆపె చరిత్రభ్రష్ట. ఆమెకు మీరు కావలయునని కాదు మీరాజ్యముపై కన్నువైచినది– మీరు సహృదయులు. గ్రహించలేరు.

సులైమాన్ :

(చలించినవాడై)– చరిత్రభ్రష్ట ..?

(అబ్దుల్ అలి రుక్నుద్దీన్ వంక చూచును)

రుక్నుద్దీన్ :

ఔను. అందులో సంశయము లేదు.

సులైమాన్ :

(మోము ప్రక్కకుత్రిప్పి, విరక్తిని ప్రదర్శించును).

అబ్దుల్ ఆలి :

మాకు ఈ రాజ్యము కావలెనని కాదు. కావలసిన మీర్హు తీసికొనుడు. ఇస్లామును, జాతిని కాపాడుడు. జహాపనా...! నామాట నమ్ముడు.

సులైమన్ :

ఊం.

అబ్దుల్ ఆలి :

సుల్తానా మహమ్మదీయ వనితలలో అందకత్తె—హృదయము కలది- జ్ఞానముకలది. ఆమె మహారాజుల వాంఛితము. ఆమెను తన కిష్టుడైన రాంమోహిద్దీన్ నునకు అంటగట్ట బోయినది. ఆఘాతుకమును భరించలేక సుల్తానా మా శరణుజొచ్చినది. ఆసుల్తానాను బలవంతముగా దీసికొనిపోవ రాంమోహిద్దీన్ వచ్చి, సుల్తానాను చీకాకుపర్చి, దొంగలించ ప్రయత్నించగా, రాకుమారులు (రుక్నుద్దీన్ వంక చూపుచు) అతనిని పట్టి బంధించిరి. ఆ యవమానమును భరించలేక సుల్తానా కుమిలిపోవుచున్నది.

సులైమన్ :

అంత అందకత్తెయా...?

అబ్దుల్ ఆలి :

మరియు గుణవంతురాలు. అనాఘ్రాత కుసుమము. ఆమె లావణ్యము తొలకరి మెఱపు.

సులైమన్ :

నన్నెఱుగును...

అబ్దుల్ ఆలి :

ఆమె ముగ్ధహృదయ. ఎఱిగినను సహజస్త్రీ స్వభావము కాన- బయటికి చెప్పదు. కాక బయటికి చెప్పినవారి హృదయములు కపటములు- స్వార్థపరములు. అది గ్రహించును. పవిత్రప్రేమ పాలపొంగువలె పైకెగిరి రూపరహితము కాదు. (సులైమన్‌లో కలిగిన ఉత్తేజము గుర్తించుచు)- ఆమె ఉచితానుచితముల గ్రహించకలిగిన పడుచు. మీకు కోరికయున్న...

సులైమన్ :

మంత్రిజీ! అట్లుచేయుము-

అబ్దుల్ ఆలి :

(సులైమన్ పాదముల ముద్దిడుకొని). మాకు రాజ్యములు వలదు- రాష్ట్రములు వలదు. మీబోటి మహారాజు సుఖముండి ఇస్లామును పోషించిన చాలును. జాతిని కాపాడిన చాలును. మీ శ్రమ కొఱకు.. ...మీ రెన్నిదినములనుండియో కన్నువైచిన 43 పరగణాలము పరిగ్రహించుడు. మతమును, జాతిని, ప్రతిష్ఠను కాపాడు భారము మీ మీద ఉంచి, మీయందుగల మా అపారభక్తిని వెల్లడించుటకు- చిహ్నము- ఈకానుక. వేరుగా తలచకుడు.

సులైమన్ :

సరి. ఆవిషయము తెలిసికొని మా సంస్థానమునకు కబురు పంపుము.

అబ్దుల్ ఆలి :

మీపని మాకుప్రధమగణ్యము.

రుక్నుద్దీన్ :

ఈపని కానిదే నిద్రపోను.

సులైమన్ :

బాగు. (అబ్దుల్ ఆలి, రుక్నుద్దీన్ నిష్క్రమించుదురు).

సులైమన్ :

(ఏకాంతమున)- అబ్దుల్ ఆలి చెప్పినమాటలలో అర్థమున్నది.

నన్ను ప్రేమించినదా...? నా రాజ్యమున కాశించినదా...? ఎప్పటి నుండి శత్రుత్వము...? కొన్ని తరములనుండి మాకు వారికి పగలు. ఇంతలో మిత్రత్వము కోరినదన్న ...అర్థము ..? ఏదో వ్యూహమున్నది తప్పక. (ఆనాటి ఆమె ప్రేమ సంభాషణ జ్ఞాపకమువచ్చి, హృదయము స్పందించును) ఓహో ...! హృదయము అమాయికి. కపటమును, తంత్రమును గ్రహించలేదు. ఇట్టి సమయములో బుద్ధిబలమును ఉపయోగించుకొనవలెను. కత్తిబలమునుచూపి మహమ్మదు బోధించిన మతము శాశ్వతముగా నిలిచి, విస్తరించినది. బుద్ధిబలమునుచూపి, శంకరుడు బోధించిన మతము చిరస్థాయియైనది. హృదయతంత్రుల భుగభుగలు విని బుద్ధుడు బోధించిన మతము క్షీణించినది. ఈసమయములో నేను కత్తిబలమును, బుద్ధిబలమును వినియోగించు టుచితము.

[యవనిక]

౧౨-వ రంగము

(బందిఖానాలో రజియా—ఈవల నొకదాసీ)-

రజియా :

మీరాకుమారులను, మంత్రులకు క్షేమమా—?

దాసీ :

సుల్తాన్‌సులైమన్‌తో రాజీ. కుదిరినదట. చాలా ఉత్సాహముగా నున్నారు. అందువల్లనే మీకు సాయముచేయకుండా సులైమను తిరిగి పోయినాడు.

రజియా ..

(తలవాల్చి)- ఇది విపరీతపు ఉనికి-

(దూరమున అబ్దుల్ ఆలిని చూచి, దాసీ తొలగిపోవును మంత్రి ప్రవేశించి)-

అబ్దులుఆలి :

పరిపాలనాధురీణ రజియా కుమారి కుశలమా ..?

రజియా :

(కుటిల భ్రుకుటియగును).

అబ్దులుఆలి :

ఇప్పటికైనా తెలిసినదా అబ్దులుఆలి చాకచక్యము...?

రజియా :

(తీక్ష్ణదృష్టిని సారించును).

అబ్దులుఆలి :

(పచార్ చేయుచు)- అబ్దుల్ ఆలి ఢిల్లీలో ఉండకూడదు ..? అతడులేని ఢిల్లీ ఏమిటో...?

రజియా :

(దీర్ఘనిశ్వాసమును విడుచును)

అబ్దులుఆలి :

మహోవాణులు నివసించునది ఇచటయా ?

రజియా :

నీవు మానవుడవు. ఘోర పిశాచమవు పిశాచీరూపుననే కోట ప్ర

[మిగతా ౧౨౯-వ పేజీలో.

అప్పిశెట్టి కవిత్వపు అఘోరింపు

కొత్తరీతి కవిత్వంకోసం అపూర్వపదాలవాడుక.
అమరం నెమరుకువచ్చిన కవిత్వం.
తెనాలి రామలింగడుచేసిన పరాభవం.

రచయిత :

పురాణం పిచ్చయ్యశాస్త్రి

విజయనగర రాజ్యాన్ని కృష్ణరాయలు పాలించేకాలంలో ఆ పట్టణమందు అప్పిశెట్టి అనేపేరు గల వర్తకుడు ఉండేవాడు. అతడు ఎక్కువగా చదువుకొన్నవాడు కాడు. ఏదో బడిచదువు కొంచెం చదివినవాడు అమరం అర్థం తెలియకపోయినా మూడు కాండలున్ను అపస్వరాలతో గుక్కతిప్పకుండా ఒప్పచెప్పేవాడు. "అమరం తెలియనివానినోట్లో నేనుఅమర" అని సరస్వతి చెప్పినట్లు వాక్యం వాడుకలో కలదనిన్ని, తాను పూర్ణంగా అమరాన్నిచదివి ఉన్నందున ఆ మహాతల్లి సరస్వతమ్మ తన నాలుకమీదనే నివసించి ఉన్నదనిన్నీ, తానున్ను నలుగురిలాగు పండితులలెక్కలో చేర్చదగినవాడే అనిన్ని శెట్టితలంపు.

అట్టి తలంపుమాత్రమేగాక తాను గొప్ప పండితుణ్ణి అనికూడా ఒక విధమైనగర్వము అప్పిశెట్టికి.

శ్రీ కృష్ణదేవ రాయలవారు విద్యాప్రియులై కవులను, విద్వాంసులను ఎక్కువగా గౌరవించడం— సన్మానించడం— క్రొత్త క్రొత్తగా కవులు వ్రాసితెచ్చే గ్రంథాలు, పద్యాలు, పాటలు విని సంతోషిస్తూవుండడం వాడుకగా ఉండేది.

ఆసంగతి అప్పిశెట్టికి బాగా తెలుసు. చూస్తూవుండేవాడు కూడాను. అప్పట్లో శెట్టికొకబుద్ధి పుట్టింది.

ఏమని? కృష్ణదేవరాయలవారు శృంగారరసంలో ప్రీతిగలవాడనిన్నీ, తానున్ను అటువంటిదేదో పాటో, పద్యమో చెప్పి చదివి వినిపించి రాయలవారి మెప్పుపొందాలనీ అనుకొన్నాడు. అయితే కవిత్వంచెప్పేశక్తి అతడికిలేదు. ఏలాగు కలుగుతుంది? అది పుట్టుకతోనే కలగాలె కాని కోరుకోంటే వస్తుందా? అయినా శెట్టి తనపట్టు విడవలేదు. ప్రయత్నంచేస్తే యెంతటి గొప్ప పనినైనా సాధించవచ్చునని అతని నమ్మకం. ఎట్లానైనా కవిత్వం చేసితీరాలసిందేనని నిర్ధారణ చేసికొన్నాడు అప్పిశెట్టి. జన్మంతోనే కవనంచెప్పేబుద్ధి కలిగకున్నా, పాండిత్యంవల్లకూడా ఏదైనా వ్రాయవచ్చునని యెవరో చెప్పగా విని వున్నందున, తాను మూడుకాండలు అమరం నిరాటంకంగా చెప్పగల పండితుడగుటవల్ల, యేదైనా ఒకటి రాయడం తనకు కష్టమైన పనిగాదనిన్నీ, శబ్దాలన్నీ తననోట్లో నుంచే కలుగతాయనిన్ని నిశ్చయం చేసికొన్నాడు.

ఒకనాడు ఉదయాన్నే కవిత్వానికి లగ్నంచూచుకొని, తాటాకు గంటము తీసుకొని తానువ్రాసేది పూర్తి అయ్యేవరకు యెవరికి తెలియరాదనిన్నీ, ఏకాంతంగా కూర్చుండి వ్రాయాలనని ఎంచుకొని పట్టణంలోనుండి బయటప్రదేశానికి పోయాడు.

ఒకచోట పెద్ద మఱ్ఱిచెట్టుంది. చూచాడు ఎవరూ లేకుండడంచేత, దానిమొదట కూర్చొనిరాయడానికి అనుకూలంగా వుంటుందనుకొన్నాడు. అక్కడికి పోయి నాలుగుతట్లా చూచాడు. ఎవరు జనులు దాపుగా లేరు. చెట్టుపుట్టవేళ్ళపై కూచున్నాడు. గంటంతల పెదివి

మీాద నాన్చుకొని ఒకచేత తాటాకుపట్టుకొని, ఏమిరాయాలనో, యెట్లారాయాలనో. ఆలోచించడానికి మొదలుపెట్టాడు క్రొత్తకవీశ్వరుడు.

అప్పు డతడికి యేమితోచిందంటే, సాధారణంగా కవులందరూ వ్రాసేమాటలు తన కవిత్వంలో ఉపయోగించరాదనీ, క్రొత్తపోకడలతో నడిపించి రాయలవారి కాశ్చర్యం కలిగించాలసిందనీ ఉద్దేశం కలిగింది. తాను అమరం చదివిన పండితుడగుటవల్ల శబ్దాల కేలోటు వుండదనే ధైర్యమేర్పడింది.

అయితే ఏదిరాయడం—అనే యోచన—నాయకుడికి, నాయకకి యెడబాటు—నాయకుడు పరితపించడం—ఆవిషయం పాటలో యిమడ్చాలె అని నిశ్చయంచేసుకొన్నాడు.

మొదలుపెట్టాడు రాయడానికి. 'శుకఃకోకిలయిత్యపి' అనే వాక్యం తోచింది. కాని, 'శుకాలు—కోకిలాలు, అందరు కవులు చెప్తూవుండేవే. ఇనే పదాలువాడితే తన క్రొత్తదనం యేముంది? ఇసీ! ఇట్లు కాదు, కడపటిశబ్దం చాలు. బుద్ధిమంతు డర్థంచేసుకుంటాడు. పండితకవనమంటె యిట్లేవుండాలె' అనుకొని మొదటిచరణం ఇత్యపితో ఆరంభించాడు కవీశ్వరుడు.

'ఇత్యపులు చెట్టెక్కికూసెగా' అని రాసి సొగసుగా కుదిరిందనుకొన్నాడు.

'దర్పకోనంగః' అనే దానిలో దర్పతీసి 'కోనంగు డంబులవేసెగా' అనిరాసి సరిగా ఉన్నదనుకొన్నాడు తరువాత 'మృగాంకః కళానిధిః'లో, మృగ అనేది తొలగించి, గాంకుడు వెన్నెలగాసెగా అని 'హిరణ్యగర్భుడనుటలో హిరణ్యాను తోసి, 'గర్భుడు వెతలొందజేసెగా, అనీ- 'సమీరో మారుతమరు' త్తనడంలో మొదటిశబ్దాలుతోసి 'తమరుడు చల్లగా డాసెగా' అనీ- మత్తకాశినిలో మొదటి అక్షరాలు రెండుతీసి 'కాశిని నన్నెడబాసెగా' అనీ- 'అకూపారంలో రెండువర్ణాలువిడిచి 'పారంలోనను ముంచివేసెగా' అనీ- యేడు చరణాలు రాశాడు. ఎనిమిదోపాదం తోచలేదు పాపము—ఏంచేస్తాడు! ఆలోచించాడు. మరీ ఆలోచించాడు—కుదరలేదు తాను రాశిన పాటను మొదట్నుంచి చూచి

ఇత్తెపులు చెట్టెక్కి కూసెగా—
కోనంగు డంబులు యేసెగా
గాంకుడు వెన్నెలగాసెగా—
గర్భుడు వెతలొంద జేసెగా
తమరుడు చల్లగా డాసెగా—
కాశిని నన్నెడబాసెగా
పారంలో నను ముంచివేసెగా—

అని నాలుగైదుమార్లు చదివాడు గట్టిగా, అక్కడ ఇతరులు లేరుగదా అనే ధైర్యంతో—

అప్పుడు 'అప్పిశెట్టి నీముండమోసెగా' అనే వాక్యం అతనికి వినబడ్డది చెట్టుపైనుండి— దయ్యమనుకొన్నాడు— దిగులుపడి తలయెత్తి చూచాడు చెట్టుమీాదికి- అక్కడ కొమ్మ పంగలో ఒకమనుష్యుడు కూర్చొనిఉన్నాడు- శెట్టి చర్యలుచూస్తూ నవ్వుకుంటూ— అప్పిశెట్టి గుండెలు జల్లుమన్నాయి- భయం- సిగ్గున్నూ- ఓరి దేవుడా! చచ్చానురా! నాపరువు తీస్తా డింక యీకొంటె ముండాకొడుకు అనుకొని చేతిలోని తాటాకు గంటము క్రిందపడేసి తిరిగిచూడకుండా పరుగెత్తి పోయాడు అప్పిశెట్టి.

చెట్టుపైనుండిన మనుష్యుడు యెవరో వింతవాడుగాడు. అతడు మన తెనాలి రామకృష్ణుడు. శెట్టి రావడమునకు ముందుగానే ఆకులు కోసికొని పోవడముకొరకువచ్చి అతడు చెట్టుపై ఎక్కి ఉండినాడు. అప్పిశెట్టి పైతట్టు చూడకుండా ఎవ్వరు లేరనుకొని అక్కడ కూర్చున్నాడు.

అతడెందుకువచ్చాడో యేమిచేస్తాడో తెలుసుకోవాలెనని రామకృష్ణుడు సందడికాకుండా కూర్చొని అంతాచూస్తూ కవిత్వం వింటూవుండి, కడపట శెట్టి ముగింపు తోచకుండా తంటాలుపడడం తెలుసుకొని నవ్వాపట్టలేక—'అప్పిశెట్టి నీముండమోసెగా' అని ఎనిమిదోపాదం పూర్తిచేశాడు. శెట్టి లజ్జతో పారిపోయాడు.

రామకృష్ణకవి శెట్టిని అంతతో విడువలేదు. శెట్టి పడేసిపోయిన తాటాకు, గంటం తీసుకొని పట్టంలోకి పోయి పదుగురికి అప్పిశెట్టి కవిత్వం చదివి వినిపించి కడుపులుబ్బేటట్లు నవ్వించాడు.

వాంఛనీయ వాఙ్మయం

'నేడు మనకు కావలసినది ఆంధ్ర రాష్ట్రాందోళనకు సహాయపడడానికి, ఆంధ్రులలో నిద్రిస్తోన్న చైతన్యాన్ని రగుల్కొల్పడానికి, సత్వరాంధ్ర రాష్ట్రసిద్ధిని బడయడానికి ఆంధ్రవీర సింహశాబకాల్ని సృష్టించే భావపూరితమైన ఆంధ్రవాఙ్మయం కావాలి.'

రచయిత.

ఆంధ్రశ్రీ
మల్యాల వేంకటశివరామకృష్ణ

ఆంధ్రరాష్ట్రంకోసం పలువురు నాయకులు ఆందోళన చేస్తూ ఆంధ్ర రాష్ట్రోద్యమం వ్యాపింపజేసి, ప్రచారం చేస్తోన్న ఈరోజులలో ప్రతీవాడూ తానాంధ్రుడనని తెలిసికోవడం-ఆంధ్రుడై పుట్టినందుకు నడచుకోనవలసిన ప్రాథమికవిధులను గుర్తించడం చాలాముఖ్యం. ఇందుకు ప్రచారం చాలా ముఖ్యమైన సాధనం. ప్రచారంచేయడం అనేక విధములు. ఉపన్యాసములు, సభలు, సమావేశాలు, పూర్వాంధ్ర వైభవ స్మరణ, చారిత్రక పరనములు, పూర్వాంధ్రవైభవమును, నేటి ప్రస్తుతాంధ్రుల దుఃస్థితిని బయలుపెట్టు ఘాటైన వ్యాసాలు, గద్య పద్యాది వాఙ్మయం, జాతీయ గీతాలు, గేయాలు మొదలైన వెన్నో ప్రచారకసాధనాలున్నాయి.

ప్రస్తుతం పైనగల మన కోరికలను తీర్చగలిగే వాఙ్మయం మన భాషలో ఏమాత్రం ఉన్నదో, దాని స్వరూప మెట్టిదో పరిశీలిద్దాము. నేడు మనకు కావలసినది ఆంధ్రరాష్ట్రాందోళనకు సహాయపడడానికి, ఆంధ్రులలో నిద్రిస్తోన్న చైతన్యాన్ని రగుల్కొల్పడానికి, సత్వరాంధ్రరాష్ట్రసిద్ధిని బడయడానికి ఆంధ్రవీరసింహశాబకాల్ని సృష్టించే భావపూరితమైన ఆంధ్రవాఙ్మయం కావాలి. ఇట్టి వాఙ్మయం పద్యాలలోగాని, గీతాలలోగాని, కథారూపకంగాగాని, ఏకాంకికలలోగాని వుండి ఆంధ్రులలో గల ఆంధ్రత్వాన్ని మేల్కొల్పాలి. ఆంధ్రత్వంలేని వారిలో ఆంధ్రత్వం సృష్టించాలి, ఆంధ్రులకు నవ్యపథాన్ని బోధించాలి. పూర్వౌన్నత్యాన్ని చాటి నేటి ఆంధ్రుల హీనస్థితిని నిరూపించి ప్రతి ఆంధ్రునిచేతా 'హా!' యనిపించాలి.

సాహిత్యం మిక్కిలి వాడియైన శూలం వంటిది. సరిగా ప్రయోగించే సాహిత్యతత్వవిశారదుడుంటే ఈసాహిత్యాస్త్రానికి తిరుగులేదు. అందుచేతనే గాదూ మన పెద్దలు కత్తిపోటుకంటె మాటపోటు హృదయాన్నెక్కువ గాయపరుస్తుందంటారు. ఇతర ప్రచారక సాధనములకంటె సాహిత్యానికే ఈగొప్పదన ముందని అందరూ ఒప్పుకున్నదే. ముకుళించిన హృదయారవిందాల్ని వికసింపజేస్తుందీ సాహిత్యదినమణి. ఆరిపోతున్న ఆంధ్రజ్యోతికి ఆముదంవంటిదీ సాహిత్యరసం.

నేటి మన ఆంధ్రావనిలో ఇట్టి విధంగా ప్రచారం సలిపే గ్రంథాల్ని తద్గ్రంథకర్తల్ని ఆంధ్రలోకానికి పరిచయం చెయ్యడం చాలా ముఖ్యం. ఆంధ్రశ్రీ విశ్వనాథ

సత్యనారాయణకవి ఆంధ్రప్రశస్తి, ఆంధ్రరాష్ట్రోద్యమ, అనే రెండు పద్యకావ్యాలు చిరకాలంక్రిందట వ్రాసేరు. ఇందు ఆంధ్రప్రశస్తి ఆంధ్రలోకానికి చేసినసేవ అనిర్వచనీయము. ఆంధ్రుల పూర్వవైభవోన్నతిని, ఆంధ్ర కవితా ప్రాగల్భ్యాన్ని వర్ణించి ఆంధ్రదేశంలోని ప్రేమికుల్నిగూడా చివురింపజేసి ఆంధ్రపుష్పాలు పుష్పింపజేశాయి అందలి పద్యాలు. ఈకవి 'వేయి పడగలు' అనే తన కల్పిత గ్రంథంలో ఆంధ్రతత్వాని కమరత్వం చేకూర్చేరు. మన సాహిత్యాన్ని- నేటి మన జమీందారులకూ, ధనాఢ్యులకూ, యువకులకూ ఆంధ్ర సాహిత్యంపై గల అభిప్రాయాల్ని ఎంతో సహజంగా చిత్రించేరు. అసదృశమైన దివ్యగ్రంథాన్ని ఆంధ్రుల కందిచ్చి ఈకవి తనజన్మ తరింపజేసి కొన్నాడు.

ఈ మధ్యనే ఆంధ్రశ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు, 'రాష్ట్రగాన'మనే పద్యకావ్యాన్ని రచించేరు. అందలి పద్యరత్నాలు పూర్వోన్నతాన్ని ఉగ్గడించడమే కాక ఆంధ్రుల కొక సందేశాన్ని బోధించి ఆంధ్రరాష్ట్రం నిమిత్తమై ఆందోళన సాగింపజేసి అనేక ఆంధ్రదేశపు యువకుల్ని నిజమైన ఆంధ్రయువకుల్నిగా తయారు చేస్తాయి. ఈగ్రంథం ప్రతీ ఆంధ్రుడూ చదవవలసిన దవడంచేత ప్రతీ వారికీ అందుబాటులో నుండునట్లు నామమాత్రం వెల యేర్పరచి ఆంధ్రులకందిచ్చి ఆంధ్రుల మన్ననలకు వీరు పాత్రులౌతున్నారని విని యున్నాము.

ఇ దులకీ గ్రంథకర్త ఎంతైనా అభివందనీయుడు.

ఆంధ్రశ్రీ కొసరాజు రాఘవయ్యచౌదరిగారి రాష్ట్రగీతికలు ప్రజామిత్ర పత్రికద్వారా ఆంధ్రుల కందీయబడి మన్ననల నందుతున్నాయి. వీరు ఆంధ్రులకు జరుగుతోన్న అన్యాయాలు, ఆంధ్రుల ఇక్కట్లు మృదువైన హాస్యధోరణిలో అతిసహజంగా వర్ణించి ఆంధ్రులకు కర్తవ్యాన్ని బోధించేరు. ఆంధ్రరాష్ట్ర ప్రతికూలురను, ఆంధ్రోద్యమానికి వేరుపురుగులైనట్టి వారిని అతిలలితంగా మనస్సు నొచ్చకుండా మందలిస్తో ఆంధ్రాగ్ని రగుల్కొల్పే వీరి పద్యాల తీరు నిజంగా చదివితీరవలసిందేగాని వ్రాయడానికి నాకలానికి శక్తి చాలదు.

ఇంకను ఆంధ్రకవితా విశారద, ఆంధ్రశ్రీ జాషువాకవి- కృష్ణదేవరాయలు, తెలుగుతల్లి, యుగంధరమంత్రి, దీర్ఘవిశ్వాసము, రాయలు, ఆంధ్రుడను అనే శీర్షికలతో అనేకరత్నాలు భారతిద్వారా ఆంధ్రలోకాని కందిచ్చేడు. హృదయంగమమై ముద్దులు మూటగట్టు లలితపదమిళితమైయున్న ఆపద్యాలు చదువుతోన్నప్పుడాకవి పాఠకుల్ని ఏదో అమరలోకానికి తీసికొనిపోయినట్లనిపిస్తుంది.

శ్రీ పింగళి నాగేంద్రరావుగారు రచించిన 'నారాజు', శ్రీ గుళ్ళపల్లి నారాయణమూర్తిగారు రచించిన 'ఆంధ్రజ్యోతి', శ్రీ నండూరి బంగారయ్యగారి 'ఆంధ్రతేజము' ఇంకను తెలుగుతల్లి మొదలైన అనేక నాటకాలు ఆంధ్రులలో గల వీరరసాన్ని వెల్లివిరియజేస్తున్నాయి.

ఇంకను చాలామంది కవులు అనేక రాష్ట్రప్రబోధ గీతికలు, పద్యాలు, మేల్కొలుపులు, జాతీయగీతాలు రచించి ఆంధ్రమాతను సేవిస్తోన్నారు.

నేటి ఆంధ్రదేశాన్ని ప్రస్తుత హీనస్థితినుండి ఉద్ధరించడానికి ఇలాంటి సాహిత్యం ఇంకా కావాలి. పైకవిచంద్రులిట్లే ఇంకా అనేక గ్రంథాలు రచించి ఆంధ్రజాతిని ధన్యురాలిని చేస్తారని ఆశిస్తున్నాను. ఇంకను అనేకులు కవులిట్లే ఆంధ్రలోకానికి గ్రంథాలు, ప్రబోధ గీతాలు రచించి ఆంధ్రమాత ఋణం తీర్చుకుందురుగాక !

రసవత్తరమైన పద్యాలు, నాటికలు రచించినా ధనాభావంచే ప్రకటింప శక్తిలేనివారు కొందరు ఆంధ్రకవులున్నారు. అట్టివారికి ఆంధ్రమహాసభవంటి మహాసంస్థ చేయూతనిచ్చి వారి గ్రంథాలు లోకానికి వెల్లడిపరిచి ఆకవుల్ని, ఆంధ్రపాఠకలోకాన్ని, ఆంధ్రమాతని ధన్యుల్ని చేస్తుందని ఆశిస్తున్నాను !

గాంధిమహాత్ముని ఉపదేశవాక్యరత్నాలు

అహింస-స్వరాజ్యం

1. హిందువులు మహమ్మదీయులు తమలో తమకున్న అవిశ్వాసాన్ని మరచి అన్నదమ్ములవలె నుండడము- హిందువులు అంటరాని సోదరులను చేందీసి సఖ్యతతో నుండడము- అజ్ఞానాంధకారములో మునిగియున్న జనసామాన్యానికి విద్యావికాసములు కలుగజేయడము- కష్టజీవులను నిరుపేదలను కూలజేయుచున్న కల్లంగళ్ళను మూసివేయడము- మిల్లుబట్టలపై మోజునువదలి నిరుపేదల గుడిసెలలో తయారైన వస్తువులను, ఖద్దరునుకొని గ్రామవృత్తులను పోత్సాహించి నిరుద్యోగులకు తిండి కల్పించడం దీక్షగా సాగించినట్లయితే కత్తి కఠారులు అవసరంలేకనే స్వరాజ్యం వచ్చితీరుతుంది. అహింసాపద్ధతిని స్వరాజ్యంరావడం ఆలస్యమైతే కావచ్చుగాని అది నూటిదైనట్టియు, సమగ్రమైనట్టియు, నిశ్చయమైనట్టియు మార్గమనే— విశ్వాసంతో అందరూ పని చెయ్యాలి. ఇందువల్ల కాంగ్రెస్‌లోని కలతలు నశిస్తాయి. పదవులకోసం, నాయకత్వంకోసం కీచులాట తప్పుతుంది.

అసహాయోద్యమము

2. అనారోగ్యము, అజ్ఞానము,

*

సంధాత:
ముత్తింటి
గు - వె - జ

సత్యనారాయణమూర్తి

*

దారిద్ర్యము, పరాధీనత అను నాల్గును భారతదేశమును పీల్చి పిప్పిచేయుచున్న పెనుభూతములు. వీని నుండి భారతదేశమును రక్షించుటే అసహాయోద్యమముయొక్క ఉద్దేశము.

3. ఈదీర్ఘ వ్యాధులు ఒక్క రాజకీయాస్త్ర ప్రయోగమువల్లనే కుదరగల్గునవి కావు. అందుచే సర్వతోముఖమగు కార్యవిధానమైన నిర్మాణకార్యక్రమము —. అనగా ఖద్దరు నిర్మాణము, హిందూ మహమ్మదీయసఖ్యత, అస్పృశ్యతా నిర్మూలనము, అహింసా సత్యములు- ఆచరణమార్గములుగాగల అసహాయోద్యమమే దేశసౌభాగ్యమును, స్వాతంత్రమును చేకూర్పగల సాధనము.

4. అసహాయోద్యమము కేవలము రాజకీయోద్యమము మాత్రమేకాదు. స్వాతంత్ర్యముతోబాటు ఆర్థిక, ఆధ్యాత్మిక, నైతికమగు అంతరంగికపరివర్తనమునుకూడ కాంక్షించుచున్న పవిత్రోద్యమము.

5. నైతిక పరివర్తనలేని రాజకీయ స్వాతంత్ర్యము మాత్రమే దేశానర్థములను తీర్పజాలదు.

సత్యాగ్రహము

6. ఆత్మశక్తి సంపన్నుండగు మహాత్ముని మనోవికాసముచే కల్గిన జిజ్ఞాసాఫలితమే సత్యాగ్రహము. సత్యాగ్రహమనగా సత్యాన్వేషణము. ఇదియే మహాత్ముని వజ్రాయుధము. అహింసాసత్యములు దీనికి రెండు ఊపిరితిత్తులు.

రాట్నము-ఖద్దరు

7. రాట్నమే పేదలపాలిటి కల్పతరువు. రాట్నమే దేశదారిద్రమును నివారింపగల సాధనము.

8. నిర్వ్యాపారులైన కోట్లకొలది భారతీయులకు కూడు గుడ్డలనిచ్చి రక్షించగల సాధనము రాట్నమే.

9. రాట్నమే స్వరాజ్యలక్ష్మి. దీపమునకు చమురువలె స్వరాజ్యసిద్ధికి రాట్నము ముఖ్యావసరము.

10. గృహపరిశ్రమములో ప్రధానమైనది రాట్నపరిశ్రమ. ఇందు కంటికి కానరాని సర్వమానవసేవ ఇమిడియున్నది.

11. భుక్తికి, ముక్తికి మూలమైన రాట్నమే నాజపమాల. రాట్నమే నాజీవిత సర్వస్వము. నా మరణకాలమున నేను చేత ధరింపగోరునది రాట్నమేగాని జపమాలకాదు. ఈయుగమున భుక్తికి, ముక్తికి ఇదియే సాధనము.

12. విదేశములకు ప్రవాహరూపమున పోవుచున్న ధనలక్ష్మిని దేశమున నిల్పగల సాధనము రాట్నమే.

13. ఎక్కువమంది యొక్క తక్కువ కష్టముతో స్వరాజ్యమును సాధింపగలసాధనము రాట్నమే.

14. కరువు కాటకములందు ప్రజారక్షణచేయగల సాధనము రాట్నమే.

15. భారతదేశమును పీల్చి పిప్పిజేయుచున్న అజ్ఞానము, అనారోగ్యము, దారిద్ర్యము, పరాధీనత అను పెనుభూతములను సంహరింపగల విష్ణుచక్రము రాట్నమే.

16. రాట్నమే అహింసా, సత్య స్వాతంత్ర్యములకు చిహ్నము.

17. రాజకీయములకు ఆర్థిక ఆధ్యాత్మికదృష్టిని, ఆర్థికములకు నైతిక, రాజకీయదృష్టిని కల్గించిన సాధనము రాట్నమే.

గోరక్షణ - పశుపోషణ

18. ఆవు మనుష్యజాతికి పెంపుడు తల్లి.

19. భారతదేశ శిశువులకు గోక్షీరమే అమృతాహారము.

20. భారతదేశ వ్యవసాయము పశువులపైనే ఆధారపడియున్నది. కాన గోరక్షణ; పశుపోషణ అవశ్య కర్తవ్యములు.

గృహస్థధర్మములు

21. గృహస్థునకు జ్ఞానార్జన మొదటివిధి. ద్రవ్యార్జన రెండవది. వీనిని సద్వినియోగ మొనర్చుట మూడవది.

22. ఏగృహస్థు తనదేశము కొరకు, సంఘముకొరకు, దైవము కొరకు, ధర్మముకొరకు పాటుపడునో అతడు మహా తపస్సంపన్నుడగు యోగిపొందు సద్గతిని పొందగలడు.

23. ఎవడు ఏవృత్తికి అర్హుడో అదియే వానికి స్వధర్మము. గృహస్థునకు స్వధర్మమే అవశ్యాచరణీయము. అన్ని కర్మములును, వృత్తులును సమానములే. చక్కగా వీధులనూడ్చు పాకీవారును, ధర్మబద్ధముగా రాజ్యపాలనముచేయు రాజును భగవంతుని దృష్టిలో సమానులే.

శరీరపోషణము

24. ఆకలికొరకేగాని భోగముకొరకు భుజింపరాదు. చెమటయూడ్చి ఆర్జించిన భోజనమునే తినుము.

25. జీవితము సేవకొరకేగాని భోగముకొరకుకాదు. మన శక్తికి మించిన వ్యయము దొంగతనముతో సమానము.

హింస

26. హింసయే పశుత్వము. అధర్మ, దౌర్జన్యములకు పాల్పడిన భగవదనుగ్రహము దూరమగును.

27. ఇతరుల కవసరమగు పదార్థములను తనవశమందుంచుకొనుట, చెడుతలపులు, ద్వేషము, కోపము, అబద్ధమాడుట ఇవన్నియు హింసాతత్వముయొక్క మారు రూపములే.

నాణెములు

28. నాణెముల మూలమున మనుష్యులలో దాపరిక వాంఛ, లోభత్వము వృద్ధినొందినవి.

ధనాశ - దారిద్ర్యము

29. ధనవంతులు తమ సిరి సంపదలకు మితి యేర్పరచుకొన్న యెడల పేదలకు సులభముగా తిండి లభించును.

30. పేరాశయే పేదరికము. తృప్తియే మహాభాగ్యము. దేశంలోని దారిద్రమునకు ధనికుల లోభత్వమే కారణము.

31. బీదలకు స్వయం సహాయమును, ధనికులకు పరోపకారబుద్ధిని బోధించిన దేశదారిద్ర్యం కొంతవరకు తగ్గగలదు.

32. మానవుడు బిడ్డలను గనునట్టియు, ధనమార్జించునట్టియు యంత్రముగా ఉండకూడదు.

స్త్రీస్వాతంత్రము

33. న్యాయశాస్త్రప్రకారము స్త్రీలకుగల లోపములు తొలగి వారికిని పురుషులతోబాటు సమాన హక్కు లనుభవించుటకు స్వేచ్ఛ యుండవలెను.

34. పురుషులను ధిక్కరించి అర్థ విహీనమగు స్వేచ్ఛ గల్గి గయ్యాళులుగా స్త్రీలు తయారు కావలెనని అర్థముకాదు.

35. ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించుట స్వేచ్ఛకాజాలదు. ధర్మబద్ధమైనట్టియు, నియమబద్ధమైనట్టియు జీవితమే స్వేచ్ఛా జీవితము.

36. పాశ్చాత్య వేషభాషలకు, నాగరికతకు వశులై భారతజాతికి కళంకము కల్గింపరాదు.

37. భారతదేశ విజ్ఞానమును గౌరవ మర్యాదలను తమయొక్క సత్ప్రవర్తనవల్ల వృద్ధిబొందించవలెను.

38. ఆదర్శ దాంపత్యమునకు నేటికిని మణులవలె ప్రకాశించుచున్న సీత, సావిత్రి, దమయంతి, అనసూయ, అరుంధతి మొదలగు పతివ్రతలవలె ఆదర్శ గృహిణులై యుండుటకు ప్రతిస్త్రీ ప్రయత్నింపవలెను.

39. సంసారమనే రాజ్యానికి (భర్త) పురుషుడు రాజు, (భార్య) స్త్రీ మంత్రియైయున్ననే ఆగృహము వన్నెకెక్కును.

వివాహములు

40. ఆత్మల ఐక్యమే వివాహము. భార్యాభర్తలం దెవ్వరు మరణించినను వివాహబంధనము తెగిపోవునది కాదు.

41. కనక వివాహమనగా నేమో తెలియని చిన్నవయస్సుగల బాలబాలికలకు తల్లిదండ్రులు గావించు వివాహము నిజమైన వివాహముకాదు. ఇది నిర్బంధ వివాహముగాన అజ్ఞానదశలో వివాహములు చేయరాదు.

42. ఇట్టి వివాహమువలన సంప్రాప్తమైన వైధవ్యము నిర్బంధ వైధవ్యముగాన ఇట్టి బాలికలకు పునర్వివాహము గావించుటే ధర్మము.

43. భార్య మరణించిన తరువాత భర్తయు, భర్త మరణించిన తరువాత భార్యయు మనః పూర్వకముగా వైధవ్య మనుభవించిననే ఆగృహము పావనమగును, ఆమతము వన్నెకెక్కును.

44. సంతానముబడయుట సహజధర్మమేగాని దానికి మితియుండవలెను. మితికి మించిన అది వ్యభిచారమేయగును. అందువలన శరీరనాశనమేగాక జాతికూడ నిర్వీర్యమై, దుర్బలమై దేశమునకు కూడ హాని కల్గించును.

45. భార్య సంసారయాత్రయందొక సహచారి. కాని ఇంద్రియసుఖము లనుభవింప నిర్మితమైన యంత్రముకాదు.

సత్ప్రవర్తనము

46. సత్ప్రవర్తనగల మనుజులు సంఘమునకు మార్గదర్శకులు మానవసంఘముయొక్క భారమంతయు సజ్జనుల భుజములపైనే గలదు.

47. సత్ప్రవర్తనమువలన మనుష్యత్వము దైవత్వముగామారును. సత్ప్రవర్తనలేని విద్యాజ్ఞానములు వ్యర్థములు.

జీవితలక్ష్యము

48. జీవితము సేవకొరకేగాని భోగముకొరకు కాదు.

49. సేవయే జ్ఞానము. స్వార్థమే అజ్ఞానము.

50. నిష్కామ కర్మమే నిజమైన ధర్మము. కోరికలేనిసేవ సంసారసముద్రము నీదుటకు నావ.

51. తన్ను దాను జయించినవాడే మహావీరుడు. ఇంద్రియములను జయించినవాడు సామ్రాజ్యములను జయించిన చక్రవర్తికన్న ఘనుడు.

52. సోమరితనమే సకలవ్యాధులకు మూలము.

53. ధనముకంటె ప్రాణము, ప్రాణముకంటె స్వాతంత్ర్యము ప్రియమైనవి. ప్రాణాన్నైనా త్యాగంచేసి స్వాతంత్ర్యాన్ని సాధించడమే (నిల్పుకొనడమే) జీవితలక్ష్యము.

54. దైవప్రార్థనలేని జన్మ వ్య

ర్థము. జీవునకు ప్రార్థనయే శరణ్యము.

55. ఇతరుల కష్టము లెవ్వడెరుంగునో అతడే వైష్ణవుడు.

56. సత్యవంతులు మరణమును మంగళకరముగా భావింతురు.

57. ఎవడు తన శరీరమును దేవమందిరముగా భావించి దాని ద్వారా మోక్షమను సాధించునో వానిదే సార్థకమగు మానవజన్మ.

58. దాన, దయా, సత్య, శౌచములు గల్గి జీవయాత్రను సాగింపుము.

59. ఏ అధికారపదవినైనా స్వలాభదృష్టితోగాక ఆత్మార్పణ బుద్ధితో నిర్వహించాలి.

60. గౌరవోద్యోగాలు ప్రజాసేవకై కల్పింపబడిన అవకాశములేగాని శాశ్వతాధికారములతో నేల జూచెడు స్థిర రాజ్యములు కావు.

61. మానవసేవయే ఈశ్వరసేవ. హరిజనసేవయే హరిసేవ.

62. అజ్ఞానమే శూద్రత్వము. సుజ్ఞానమే బ్రాహ్మణత్వము.

63. సంసారసముద్రము నీదుటకు శ్రీరామనామమే భద్రమగు నావ.

64. జీవితమును ధనమార్జించుటయందును, విద్యను ధనోపార్జనా సాధనముగను వినియోగించు మానవుల జీవితము వ్యర్థము.

65. దుర్బలులకు భగవంతుడే బలము. దిక్కులేనివారికి దేవుడే దిక్కు.

తెలుగువారి తెలుగుతనం

ఆంధ్రభూమి పాఠకులకు—

ప్రియ సోదరులారా?

ఆంధ్రభూమి ఆగష్టు సంచికలో తెలుగు పత్రికల తెలుగుతనం అనే వ్యాసంలో మన వర్తక వ్యాపారాదుల్ని పెంపొందించుకోడానికి తెలుగు పత్రికలలో మన వస్తువుల్ని గురించి ఆంధ్రేతరభాష అయిన ఆంగ్లంలో ప్రకటించడంవల్ల మన ఆంగ్లం తెలియని ఆంధ్రపత్రికా పాఠకులలో ఆయాసరకులు ప్రచారమవడానికి ఎక్కువ అవకాశం ఉండదు గనుక తెలుగులోనే ప్రకటించడం న్యాయమని నేను వ్రాశాను. దానిపై ఒంగోలునుండి శ్రీ ఆలూరి పద్మనాభంగారు ఇంగ్లీషు వర్తకభాష అనీ, వర్తక సందర్భంలో మనం ఆ భాషని విడనాడడం మనకే నష్టమనీ నావ్యాసం బాగా తెలుగుమీరి వుందనీ విమర్శించేరు.

మన దేశానికేగాక ప్రపంచం మొత్తానికంతకీ వాణిజ్యభాష ఇంగ్లీషే. వాణిజ్యశాస్త్రంలో పట్ట పరీక్షకు (B-Com) పఠించిన నాకా విషయం తెలియక కాదు. మన పరిశ్రమల్ని గురించి ఆంగ్లంలోనే కాదు, అన్ని భాషల్లోనూ ప్రకటించవలసినదే. కాదనను కాని గుజరాతీ పత్రికలో తెలుగుమందైన అమృతాంజనాన్ని గురించి తెలుగులో ప్రకటిస్తే ఏంలాభముంటుందో తెలుగుపత్రికలో ఆంగ్లభాషని ప్రకటించినా అదేలాభం చేకూరుతుంది. ఈ నా అభిప్రాయాన్ని శ్రీ పద్మనాభంగారు గుర్తించలేదని తలుస్తాను. నావ్యాసంలో వర్తకభాష అయిన ఆంగ్లాన్ని ఆంధ్రవర్తకులంతా బహిష్కరించాలనే అభిప్రాయం ఎక్కడా వెలిబుచ్చలేదే! తెలుగు పత్రికల్లో ఆంగ్లాన్ని ప్రకటించే దురాచారాన్ని నేను నిరసించేను. అట్లే ఆంగ్లపత్రికలో తెలుగుని ప్రకటించినా నేను నిరసిస్తాను. నా అభిప్రాయం ఈసారైనా సరిగా అర్థం చేసుకుంటే పద్మనాభంగారి సందేహం నివర్తిస్తుంది. ఇప్పటికీ వారి అభిప్రాయం మారకుంటే అది విచారణీయాంశం. అది వారి ఆంధ్రత్వరహితాన్నే వెల్లడిస్తుంది.

మన తెలుగువారిలో ఇలాంటి కుశ్శంకలు బయలుదేరుతోన్నంత కాలం ఆంధ్రరాష్ట్రసిద్ధి మనకి ఓ నాటికోనాడు దూరమే అవుతోందన్న సంగతి గుర్తించాలి.

ఆంధ్రభూమి పాఠక మహాశయులిప్పుడైనా నా అభిప్రాయాన్ని గుర్తించి ఆమోదిస్తారా?

—మల్యాల వేంకటశివరామకృష్ణ.

వివాహం : వ్యభిచారం

[ఈ వ్యాసంలో 'వివాహం-వ్యభిచారం' అనే సమస్యకు సంబంధించిన విషయాలు బహుముఖాలుగా పర్యాలోకింపబడ్డాయి. జిజ్ఞాసాపరులు తప్పక చదవవలసిన వ్యాసం.]

రచయిత:

శ్రీ గజపతి రాయవర్మ

వ్యభిచారం – వృత్తి – దేవదాసీ ఇత్యాది పదాలతో ఇన్ని రాద్ధాంతా లవుతున్నాయే! ఈ రంకులో ఉన్న తప్పూ పాపమూ ఏంవిటి? వ్యభిచారమనేది ఎందుకేర్పడింది? నిజంగా వ్యభిచార నిర్మూలన మనేది జరుగుతుందా? పెళ్ళికీ, రంకుకీ ఉన్న చుట్టరికమేంవిటి? అవెందుకు సృష్టి అయ్యాయి?

ఇన్నిటికీ ముక్తసరిగా ప్రత్యుత్తర మీయాలంటే ఆరంభించిన నాటి మానవుల ఆచార వ్యవహారములే అనాలి. అందుకా దినాలూ పరికించాలి.

పెళ్ళిపక్కనే రంకు ఉండక తప్పదు– అయినా పాతుకున్నా ఆచారవ్యవహారము లన్నిటా కాలానుగుణ్యముగా మార్పు పొందిన దేశం అలా చేసుకోగల్గిన సంఘానిదే శాంతీ, శ్రేయస్సూను. ఈ ఆచారా లెలా ఏర్పడినవో ఎరిగే ప్రయత్నం లేకుండానే సాంప్రదాయాలూ, కులాచారాలూ, నీతి, పుణ్యమూ ఇత్యాదులు నశించి పోతున్నాయని, వాటి కలయూపైనా గమనించకుండా, ఆక్రోశించే ఛాందసచక్రవర్తులకు అవాచ్యాలేమో గాని నే వ్రాయబోయే కారణాలు అనేకు లంగీకరిస్తారనే నా ధైర్యం.

విశ్వం రూపించి మనుష్యులు తిరుగాడిన కాలంలో వివాహం వ్యభిచారం రెండూ లేవు. స్వేచ్ఛా సంగమాలు; దేవునిపేరిట సంభోగాలూ హెచ్చినకొలది జనాభాకూడా పెరుగుతుంది గదా! అయినా అప్పటి జనాభా వృద్ధికి ఇప్పటివలె నివసించడానికి స్థలం లేకపోలేదు. కాని కొందరు వలసపోతూండడమూ ఉంది. స్వైర్వం అనగానే బలాబలాలు చూచుకోడం, ఎన్నో అలజడి అశాంతులు సంభవించడం, బలహీనులకు అన్యాయం జరగడం, అనేకులు అనారోగ్యు లవడం, ఇవన్నీగాక అలా స్వైరంగా ప్రవర్తించిన వారి సంతానములకు బాధ్యత అనేది తక్కువై 'ఎవడికి పుట్టావురా– వెక్కి వెక్కి ఏడుస్తావు' అన్నట్లు పరిణమించడం సంభవిస్తుంది. ఆనాటి అల్పసంఖ్యాకులూ, దూరదృష్టితోనే అనుకుందాం, సంతానాన్ని బాధ్యతతో పెంచడానికి జోడీలుగానూ, కుటుంబాలుగానూ, సంఘాలుగానూ నియమాలేర్పర్చుకున్నారని ఎందుకనరాదు?

మోక్షం– సద్గతీ అనే మిషతో ఆ నియమాల్ని పాటించేటట్లు భయపెట్టి భావపారతంత్రుల చేసారంటే విశ్వసనీయం కాదంటారా?

ఇదీ కాకుంటే పెళ్ళిరాక కింకో కారణం చెప్పవచ్చును. మనం అనుదినమూ చూస్తూన్న జీవకోటిని బట్టి సంభోగం అనేది సంతానమునకు అనే గ్రహించగలము. అపుత్రస్య గతిర్నాస్తీ వచనం ఇందుకే పుట్టిందనవచ్చును. స్వేచ్ఛా సంగమాల్ని ఆధునిక సంఘం అంగీకరించదు. ఇటలీ జర్మనీల వైఖరి చూడండి. జనాభా తగ్గించుకొన్న (విజాతీయ బహిష్కరణ) రాజ్యాల్లో బలానికి జనభా జాతీయంగా వృద్ధిపొందాలని ఆనియంతల విలా

సాలు చూడండి. వివాహం చేసు కుంటే- పిల్లల్ని కంటే బహుమానాలూ, గౌరవాలూను. ఈ ఆధునిక సందర్భంలాంటిదే- ఇలాగే పూర్వం కొందరు భూమి నాక్రమించుకోడానికి, ఎవరిమట్టుకు వారు ఆధిపత్యం తమ జాతికే- మతానికే ఉండాలని- పార్టీ బలానికి జనాభా హెచ్చాలి కాబట్టి సంతానాపేక్షతో. సంభోగ సంసారాలకు నియమూ లేర్పర్చుకొని 'పెళ్ళి'అని ప్రారంభించారని అనుకోవచ్చును. మరి స్వేచ్ఛా సురతాల్లో సంతానోత్పత్తి నశించే దౌర్బల్యం ఉంది; కదూ' స్వేచ్ఛా సంగమాల్ని అణచాలన్నా- సంతానానికే అన్నా పెళ్ళిఅనేది బలమైన జాతిసృష్టి అయి. గల్లంతులు ఆ కాలాన్నిబట్టి అట్టే లేకుండా ఉండాలనే అవవచ్చును.

పెళ్ళివల్ల సంబంధం- రెండు కులాలు, జాతులు, దేశాలు, రాజ్యాలు, మతాలు, కుటుంబాల మధ్య శాశ్వతం కావాలనే ఆశయంలేకపోలేదు సంబంధం కోసమే పూర్వంనుంచీ, పలుకుబడీ- బలవంతులతో విరోధాలూ, ఇతరులవల్ల అపకారాలూ కల్గకుండా ఉండాలనే సూత్రంతోనే అనేకులు బహుత్వమైనాసరే ఇతర కుల జాతి మతాలవారిని వివాహించుట జరుగుతుంది. అలజడి కల్గించేవారి కంటికి నైతికం అయినా ఇదో రాజకీయదృష్టి అనాలి.

ఇన్నీ వదలి మధ్యస్థమైనా మ నంభక్తితో చేతులు జోడించి మోక్షం- పవిత్రం అని సేవజేస్తూన్న దేవతకే అనేకులు వొట్టి రంకుబోతులన్నా- సిగ్గూ లజ్జా నీతీ నియమంలేని ఈ త్రాగుబోతులే స్వేచ్ఛాసంభోగవ్యభిచారులంటే మీలో చాలమంది మనసులు చివుక్కుమంటాయి కాని పరిశీలిస్తే మీరే అవునంటారు.

పెళ్ళినిగూర్చి ఇంకా లోతుగా పోదాం. ఒకప్పుడు జాతి- వర్ణం- వయస్సు ఇలాంటి నిర్ణయాలేవీ లేవనీ- వృత్తినిబట్టి జీవనం అనడం లేదనీ, అనేదినాల్లో ఎవరికిష్టమైన వారితో వారు యథేచ్ఛగా రతించే రోజుల్లో అది తప్పూ- పాపమూ అవినీతీ అనలేదెవరూ. నేను ప్రబంధ శృంగారాన్ని అసహ్యించుకునేవారూ, బూతునే హాస్యానికుపయోగించుకుంటే తిట్టేవారూ ఉన్నట్లే ఆనాడూ స్వైర శృంగారాన్ని కూడదనే వారున్నారు.

నా నీ భేదంలేకుండా జరిగే ఆ రతిక్రీడలవలన శరీరాని కవస్థలు రావచ్చును. బలహీనునకు పౌరుషం కూడదన్నట్లు, షండుడు ఏమి అందంలే అన్నట్లూ చేవజారిపోయిన వారు స్వేచ్ఛ కూడదని వివాహం కట్టేరనుటకు అవకాశమున్నది. కారణమేదైనా మరుగు చేశారు. కాని వివాహం నాటి ప్రజల మంచికే ఏర్పడి ఉంటుంది. దీనితో అంతఃకలహాలు అణగాలనో, లోపాలున్నా ఒకరికొకరు లోబడి ఉండాలనో, పెళ్ళితో ఎవరికివారు ముక్కుతాళ్లు బిగించుకున్నట్లుగా పరిణమించింది.

సంతానాన్ని పోషించుకుంటూ ఇతరులనుండి తనతో జతకట్టిన స్త్రీని కాపాడుకోడమే వివాహం అయింది.

మతమూ దేవుడూ అనే విషయం ప్రపంచంలో ఎన్నో ఘనకార్యాల్ని మంచికీ చెడ్డకీ పట్టుదలతో సాగింపజేసింది. మతం, మోక్షం ప్రజల మెదడు కెక్కింది. ఈ అవకాశాన్ని పురస్కరించుకుని సోమరిపోతు లయిపోతూ- స్వార్థమే పరమావధి అనుకుని కొందరు పిల్లలకు మిఠాయిచూపి ఆశపెట్టినట్లు దేవుణ్ని పెట్టి ఆప్రచారంతో అమాయిక జనాన్ని మభ్యపెట్టి- మోసగించి లోబర్చుకున్నారు. స్వర్గం- నరకం రెండులోకాలు- వీరన్న మాట కాదంటే నరకప్రాప్తి తప్పదనేంత పాతుకుపోయింది.

ఒక జోడీ కాపురం చేసుకుంటూంటే- అంతమాత్రాన ఆమెను కోరిన ఇంకోడు ఊరుకోడు. ఏదో విధంగా ఆస్త్రీని లాక్కుపోతాడు. కాకుంటే నవ్యత నాశించే మానవ హృదయం ఇంకోర్ని చేరవచ్చును. అందు కూరకనే పెళ్ళి అన్నంత మాత్రాన ఆగదని ఋజువు- సాక్ష్యాలూ- ప్రమాణాలు ఎంతో తతంగం ఏర్పడింది. అమాయక జనానికి అర్థంకాని మాటల్లో వా

ర్ని లోబర్చుకుని కొందరు తమ స్త్రీలను శరీరబలం ఉన్నవారెత్తుకుపోకుండా పెళ్ళి మోతౌనికని మతంపేరు చెప్పారనీ తలపవచ్చును.

ఈనాటికీ పెళ్ళి నిజం సంకోచించాల్సిందే అయినా, మహా పవిత్రం అయింది. ఆ ఆచారాల్ని తుదలు తప్పరాదట. ఇంతా పవిత్రతా బుగ్గి అయిపోతుందని అరిచేవారే వితాంతూద్వాహాల్ని– హాధాబాయి బిల్లును ఎందుకు సమర్థించాలి? తప్పు అంటే ఈమార్పులూ తప్పే– అందుకే నవయుగానుగుణ్యంగా తప్పుల్ని, పాపాల్ని– ఒప్పుగా, పుణ్యంగా మార్చుకోమనడం.

పెళ్ళితంతుతో స్వేచ్ఛతగ్గిందా? ఓ విధంగా నేటికీ తగ్గలేదు. వివాహమే అయినా పాపం అసభ్యం అన్నంతవరకూ ఏదో విధంగా మరోరూపంలో వ్యభిచారం ఉంటుంది.

స్వేచ్ఛా నంగమాల కలవడిన వారిని కేటాయించినంతమాత్రాన ఆగుతారా? రుచిమరిగిన కుక్క చెప్పులు కొరకడం మానుతుందా? పెళ్ళయినంత మాత్రాన ఒకరితోనే ఆకట్టు కూచుంటారా?

బహుత్వం ఏర్పడ్డానికిదో కారణం అయివుండును. సంస్కరణోద్యమా లెంత శ్రమించినా ఈ ఆనందాలు కట్టువడుట కష్టసాధ్యం. తృప్తికో మరేకారణాలనో ప్రత్యేక పరిస్థితుల్లోమాత్రం అని కొన్ని సవరణలు తెచ్చారు. పురుషుల అధికారంలో బహుభార్యాత్వమూ– స్త్రీల హయాంలో బహు భర్తృత్వము ఏర్పడిన వనొచ్చును.

శాస్త్రీయంగా చెప్పాలంటే పురుషుని సంతృప్తికో స్త్రీచాలదని అనేకుల అభిప్రాయము. అందు కొకోడి కిద్దరేసి భార్యలుండాలి. నిజంకూడా ఇంతేనేమో! అయితే ఈ సిద్ధాంతాన్ని ఆధునికం చేయడానికి సమాన ప్రతిపత్తులుండాలి. కాబట్టి స్త్రీకూడా ఇద్దరు భర్తలుండాలి. బెదిరిపోకండి——

ఒక స్త్రీ ఒకపురుషుడూ యావజ్జీవమూ ఒకరితోనే ఉంటున్నారు– పరాయి ముఖం చూడలేదు అనడాని కాస్తే అవకాశాలులేవు. పక్షులే భాగస్వామి నశిస్తే ఇంకోర్ని చేరుతున్నాయి– దాంపత్య ధర్మాలు చక్కబెట్టుకుంటూన్నా కనీసంగా ఆడదో మగాడో పరాయిచేయి కలపడం ఉంది. అయినా ఎంతకోర్కె ఉన్నా పతివ్రతా ధర్మమని స్త్రీని ఒక్కడితోనే ఉండాలన్నారు మీసాల మనుష్యులు. కాని ఒక స్త్రీతో ఉన్నందుకే సుమండీ శ్రీరాముడు అవతార పురుషుడనిపించుకున్నాడు. ఆ కాలీన నియమాలు శిరసావహించిన వారే మహాత్ములు.

పెళ్ళితోతృప్తిపడక చాటునా, మాటునా తంటాలుపడితే వ్యభిచారం అయింది. రాగిచెంబుకు పంగనామాలుదిద్ది చెలామణి అయినట్లు పాపం అనేపదంతో రంకాగడానికీ, అంతఃకలహాలు తగ్గడానికీ నరకాన్ని కల్పించేరేమో! అటుపూర్వం ఉండే స్వేచ్ఛాలేదు– ఇటు అత్యావసరమంటే దోషం అయింది. కాని ఈ వాంఛ గోడలు దాటిపోతూండడం చూసి అలాంటివారికి ప్రివిలేజి ఇచ్చేరంటే– నిజానికది వ్యభిచారమే అయినా– స్వేచ్ఛాసంగమానికి గౌరవప్రత్యామ్నాయమే అయినా వెళ్ళితంతుతో ఆనందించే అవకాశం కల్పించి అల్లర్లాపుకున్నారు.

సారస్వత చరిత్రాదుల్ని స్మరించండి ఏ దేశానిదైనా సరే– సంఘం ఎలా మార్పుపొందుకుపోయిందో– బహుత్వం పెళ్ళిగా ఉండకపోతే వ్యభిచారం అయింది. కొన్ని మతాల్లో ఒక్క స్త్రీని మాత్రం వివాహమాడి అనేకుల్ని జాబ్ వర్కర్సుగా జనానాల్లో నిలవచేసుకోడానికి అధికారం యిచ్చిన ప్రివిలేజీ ఇదే.

పూర్వాచారాలతో సంఘం ఈడ్గిలబడి జారిపోతూంటే బహుభార్యాత్వం కూడదనే వాదం ఏర్పడిందిగదా! నచ్చిన భార్య ఉన్నా మరోభార్యకూడదని శాసిస్తే పర్యవసానం ఎలావుంటుంది? ఆర్థికంగా వచ్చే నష్టం అటుంచండి– మరో పెళ్ళి కనుమతించనందున ప్రభుత్వమే తప్పట్టే వ్యభిచారాన్ని హొ

చ్చించిన దవుతుంది. ఈ నిషేధం తో విడాకుల అనుమతీ ఉండే అవకాశంలో అరిష్టాలాట్టే రాకపోవచ్చును. కాని ఈమాత్రం శాసనాలు చాలవు, అలాంటివి చేయడానికి గొప్ప నియంత కావాలి- ఎన్నో కడగండ్లూ పడాలీ పాపిష్ఠి సంఘంలో.

ఈ శాసనా లున్నంతమాత్రమున బహుత్వ మాగదు. విడాకులు తోనైనా మరోవిధంగా సాగుతూనే వుంటుంది. పెళ్ళి అయింది కాబట్టి తప్పు లేదంటారు.

ఇదిమట్టు కెందుకు వ్యభిచారం కాదు? పురుషులు భుక్తంచేసుకోడం ఎక్కువై నకొలదీ స్త్రీలకు అలాంటి అధికారాలు తగ్గినా, పెళ్ళి లేకున్నా నాడూ నేడూ సంతానాపేక్ష మరోకారణం ఏదోసాకుతో బహుత్వం మోజుకైనా సాగుతూనేవుంది.

సంతానం పేరుచెప్పీ- వరప్రసాదమనీ పూర్వం ఋషులే ఇతర ఋషి- స్త్రీలను తెచ్చుకోడం- బ్రాహ్మణు లితర స్త్రీలను సంతానోత్పత్తికని చేరడం నేటికీ భర్తలే భార్యల్ని సంతానం- మరోకారణం ఏదోచెప్పి ఇతరుల కీయడం ఎన్నో ఉన్నాయి.

ఆర్యమత సిద్ధాంతాల్లోని- ఆసురుల స్వేచ్ఛా సంగమాలే బహుత్వంగా మారినవనుట కవకాశమున్నది.

స్మృతి నిర్మాతల సంతానాలే డజన్ల భర్తలను కట్టుకున్నారు!

ప్రాతవి త్రవ్వుకోడంకన్నా ఆధునిక యుగానికి మేలుచేసే మార్పులు చేసుకోవాలి. సంస్కరించుకోవాలి. పాపపుణ్యాల్ని మూలబెట్టి దేశం- సంఘం- సౌభాగ్యాన్నే శరణ్యం చేసుకుని తిరగాలి.

పురుషులతో సమానహక్కులు మాకూ ఇవ్వాలనే వారుండబట్టే బహు పత్నీత్వం ఏర్పడింది.

మనదేశాన్నే కాదు ప్రపంచమంతటా పెళ్ళి ప్రసక్తి లేకుండానే తప్పు- పాపం లేకుండానే కాపురంచేసే జాతులున్నవి.

తప్పన్నా పెళ్ళికాకుండా కాపురంచేస్తున్నవారూ ఉన్నారు. కాని పెళ్ళిలేకుండా సంసారం చేసుకుంటుంటే సంఘం దుమ్మెత్తి పోయడమే కాదు చిత్రవధచేయాలంటుంది. స్త్రీ పురుషు లెందుకు కవగట్టినా సాంఘికంగా డిక్లరేషనుకు గౌరవానికి ఏలాంటి పెళ్ళితంతునైనా ప్రదర్శించాలి విధిగా. పెళ్ళి లేకున్నా ఒకోరితోనే చచ్చేవరకూ కాపురంచేసినా, వ్యభిచారకుటుంబాల్లో వారే ఏకత్వం పెళ్ళి లేకుండా పాటిస్తూన్నా- మిశ్రజాతి మతాలవారే పరకీయాల్ని చూడకుండా వివాహం లేకుండా ఉన్నంత మాత్రాన వారికి పెళ్ళి అయిన వారికన్న గౌరవం లేదీ సంఘాన. సంఘం లీగల్‌గా వారి నాలుమగలనదు. ముండను తెచ్చాడు- లేచిపోయింది- ఉంచుకున్నాడు వంటి నీచ భావాలే పెళ్ళికానంతమాత్రాన ఎంత అన్యోన్యంగా ఉంటూన్న జోడీలయినా వారంటే. కాని ఎంత అసహ్యంగా వ్యభిచరిస్తూన్నా పెళ్ళి అయినంతమాత్రాన భార్యాభర్తలని గౌరవమూ, అధికారమూవుందీ సంఘంలో. నీచాతినీచంగా ప్రవర్తించినా ఉద్యావన సంపర్కాలుండి పెండ్లి అనేది జరిగితేచాలు——

ఇవన్నీ అటుంచి- ఇప్పుడు కావాల్సిన మార్పేమిటో ఆలోచించాలి.

సంసార సందర్భాల్లో ఏయే మార్పులుండాలి? సంతాన విషయంలో ఏమార్పులుండాలి?

అధికారాని కే మార్పు లుండాలి?

ఆర్థికంగా పొందాల్సినదే విధానము?

ఈమార్పులన్నీ ఎవరు చేయగలరు?

ఇవి అన్నీ ఆలోచించవలసిన సమస్యలు.

రేడియో వినేవారు

• ఒక్కొక్క రేడియోసెట్టుకి నలుగురి చొప్పున వింటున్నారనుకుంటే 1937 సంవత్సరాంతానికి రేడియో శ్రోతలు 35 కోట్లమంది ఉన్నారని ఇంటర్ నేషనల్ రేడియో యూనియన్ అంచనా.

దుర్గావతి

పాశ్చాత్య ప్రముఖులచే ప్రశంసల నందిన
భారత వీరాంగన పవిత్ర చరిత్ర.

రచయిత

అలంపురం రాజు, బి. యే.

ప్రతాపశాలియగు నక్బరు ఢిల్లీ సింహాసనారూఢుడై యుండెను. మొగలు సామ్రాజ్యపు అర్ధచంద్రాంకితధ్వజము కాశ్మీరమునుండి కన్యాకుమారివరకును, సింధునదినుండి బంగాళాఖాతమువరకును ఎగురుచుండెను. పూర్వపు ఆఫ్ఘన్ రాజులు ఢిల్లీశ్వరునకు లొంగి బద్ధహస్తులై నిలచిరి. రాజపుత్రులందనేకులు మొగలుల దోర్దండప్రతాపమునకు గురియగుటచే వారి దుర్గములు మొగలుల విహారస్థానములయ్యెను. కాని గఢామండలపు రాణి అక్బరునకు లొంగలేదు. చతురోపాయసంపన్నుడగు అక్బరు గఢామండలరాణి దుర్గావతిచే తన సార్వభౌమత్వము నంగీకరింపజేయుట కనేక యుపాయముల బన్నెను. తేజస్వినియగు దుర్గావతి వీరసాహసములచే నవి నిష్ఫలములయ్యెను.

దుర్గావతి మధ్యహిందూస్థానములోని మహోబా సంస్థానపురాజు చందేలుని పుత్రి. ఆ యాస్థానపు నధిదేవతయగు దుర్గ నామ మా రాజపుత్రికిడిరి. తన పుత్రిక గుణసౌందర్యములు జూచి యానందపడుచున్న చందేలుడు నామె నొక మహారాజునకిచ్చి వివాహ మొనర్పవలెనని యాశించుచుండెను. గఢామండలరాజగు దళపతి శహాని సాహసపరాక్రమములు విని ముగ్ధురాలై దుర్గావతి తన తండ్రికి తెలియకుండ నావీరుని తన మనమున వరించెను. దళపతి మహాయోధుడు, రాజకార్యధురంధరుడు. దుర్గావతి తనకోర్కెను దూతిద్వారా దళపతి కెరిగించెను. దళపతి యీప్రేమపురస్కారము నత్యంతశ్రద్ధతో స్వీకరించెను. కాని యీ సంబంధము చందేలునికి నచ్చలేదు. దళపతి సామాన్య రాజపుత్రుడనియును, అతని రాజ్యము చిన్నదనియును, ఈ సంబంధముచే తన కులగౌరవము హెచ్చదనియు చందేలుని యభిప్రాయము. అందుచే నొక యుపాయముపన్ని యర్ధలక్ష సైన్యముతో స్వయంవరమునకు రావలసినదిగా దళపతికి కమ్మనంపెను. స్వయంవరమునకు వచ్చులోపుగా యర్ధలక్ష సైన్యమును దళపతి సమకూర్చలేడనియు, ఆకారణముచే స్వయంవరమందిరమును దళపతి ప్రవేశించుట సంభవింప నేరదనియు చందేలుడు నమ్మెను. వీరభూమి తురుష్కుల పాలైనను వీరత్వము భారతభూమియందు నశింపలేదనియు ప్రసిద్ధవీరనాయకుడు రాజపుత్రులనందరిని సమకూర్చినచో తురుష్కుల పారద్రోలుశక్తిసామర్థ్యములు హిందూపుంగవులందు గలవనియు చందేలుడు గుర్తించలేదు.

స్వయంవర మంటపమునందు దుర్గావతి సౌందర్యసాహసముల విని ముగ్ధులై వచ్చిన రాజపుత్రు లుచితాసనములపై గూర్చుండియుండిరి. కాని రాజపుత్రమండలమునందు గఢామండలాధీశుడు లేడు. పుష్పమాలను చేతనిడికొని వచ్చిన దుర్గావతి ప్రతిమవలె నిలచియుండెను. దళపతి ముఖ మామెకు కనపడలేదు. తత్క్షణమే యామె యశ్రుబిందు వొకటి పూలమాలపైబడి, యొక్కనిముషములో హిమబిందువుబోలి పూరేకునుండి జారి కర్కశభూమిపైబడి యారిపోయెను. సుముహూర్తము దాటిపోవుచున్నదని చందేలుడు కుమార్తెను హెచ్చరించెను. కాని యామె ముకుళితమనస్సునం దీమాట ప్రవేశింపలేదు. ఆమె హృదయకమలము వికసింపజేయు బాలసూర్యుడింకను పూర్వశిఖరమున గోచరించలేదు. దళపతి సైన్యమును చేకూర్చి స్వయంవరమునకు వచ్చుటయం దాలస్యమయ్యెను. దుర్గావతి యవస్థనుచూచి యాహ్వానింపబడిన రాజపుత్రులు విస్మయమందిరి. కన్నియ మాట్లాడకయే మండపబహిర్ద్వారము చేరెను. అప్పుడే దళపతి గజమునుండి దిగి మండపము ప్రవేశింప తత్తరపాటుతో వచ్చుచుండెను. దూరమునుండి యెగిరివచ్చు పురుషకపోతమును విరహిణియగు స్త్రీకపోతము చూచి రెక్కలు విప్పి పరుగిడి కలసికొనునట్లు దళపతి స్వ

యంవరమంటపమందు కాలిడకనే దుర్గావతి త్వరితగతిని కుసుమమాల నాతని కంఠమునకువైచి యాతని వామభాగమున నిలచెను. భగ్నమనోరథుడై చందేలుడు దుర్గావతిని దళపతికి ఖడ్గధారాపూర్వకముగా నివ్వ సమకట్టెను. తక్షణమే స్వయంవర మంటపము సమరభూమి యయ్యెను. ఇరుపక్షములవారికిని ఘోరయుద్ధము జరిగెను. ఆయుద్ధమునందు చందేలుడు వీరస్వర్గమునందెను. విజయియగు దళపతి దుర్గావతిని తన నగరమునకు గొంపోయెను.

కాని దుర్గావతితో సహవాస సుఖము చిరకాల మనుభవించుటకు దళపతి నుదుటిపై విధాత వ్రాసియుండలేదు. దుర్గావతికి కుమారుడు పుట్టిన కొన్ని నెలలకే దళపతి కాలముచేసెను. గఢామండలమును స్వల్పకాల మంధకార మావహించెను. గఢామండలమునగల యీదుర్గతి చూచి అక్బరు సమయమునకై ఎదురుచూచుచుండెను. కాని దుర్గావతి పతివియోగదుఃఖముచే వచ్చు కన్నీటి నరికట్టి రాజ్యభారమును వహించి సంస్థానాభివృద్ధికిని, బాలుని యభ్యుదయమునకును సమకట్టెను. తమకు తల్లివలె వర్తించుచున్న దుర్గావతి పాలనయందు ప్రజలు సంతుష్టచిత్తులై తమ యధిపతియకాలమరణదుఃఖమును క్రమేణా మరువజొచ్చిరి.

అవిచ్ఛిన్నమైన సుఖము మనుష్యమాత్రునికి దుర్లభము. దుర్గావతి రాజ్యరక్షణసుఖ మనుభవించుటకు ప్రజలు నోచుకొనలేదు. ఆమె దేశోన్నతి సమాచారమును విని యసూయపడిన వారనేకులుగలరు. వారిలో అసోఫ్‌ఖానొకడు. అసోఫ్‌ఖాను గఢామండల సరిహద్దులలో మాళవదేశమునకు సుబేదారుగానుండెను. స్త్రీపాలిత సంస్థానము నాక్రమింప సమయమిదేయని యనేకసారులు రాజాధిరాజగు యక్బరునకు లేఖల నంపెను. అబలయగు దుర్గావతిని, బాలుడగు వీరనరేంద్రుని చంపి రాజ్యముచేపట్టుట కక్బరు మనస్సునకు రుచింపలేదు. గఢామండలమును రక్తపాతములేకుండ సామ్రాజ్యమున చేర్చుకొనవలెనని పలుతెరంగుల యోచించెను. విఫలుడై తుదకు అసోఫ్‌ఖానని పట్టుసలవిూన గఢామండలముపై దండెత్తుట కాజ్ఞయిచ్చెను.

అసోఫ్‌ఖాను తురుష్కసైన్యముల నసంఖ్యాకములుగ దెచ్చి పురద్వారమున నిలిపెను. నగరమున కోలాహలము హెచ్చెను. అప్పుడు సంస్థాన ముఖ్యాధికారులను పిలచి దుర్గావతి యిట్లనెను. 'మీరు బుద్ధిమంతులు. రణనైపుణ్యశీలురు. నేను స్త్రీనిగదా. మనకందరికి దుస్సహమగు యాపత్తు సంభవించినది. నిరపరాధులమగు మనలను చంపి, మన మతమును నిర్మూలించి, మనరాజ్యము నాక్రమింపజూచు ఈ మ్లేచ్ఛులనడుగ మాంచితిరిగదా. ఈ ధర్మాంధులగు ముసల్మానులచే పీడింపబడుటకు మన పౌరుషము నశించినదా! నా ప్రజలారా! నాబంధుమిత్రులారా! మన మీ యుద్ధమున ఓడిపోయినచో మన నామరూపములుండవు. మతముండదు. మనస్త్రీలు వారి తొత్తులై యుండవలసి వచ్చును. క్షత్రియత్వము నశించును. ఇంతకన్న యధోగతి యుండునా? భారతభూమియం దింకను పౌరుషమున్నచో నిప్పుడు మాపుము. మీరు వీరశిరోమణులగు రాజపుత్రుల పేరు నిలుపగోరినచో ఈఅనాథగోవును రక్షింపుడు. గోహత్యకు వారు వెనుదీయరు. కాని యథార్థస్థితి వారు గ్రహించియుండలేదు. ఈ గోవే వారిపాలిట వ్యాఘ్రముగా పరిణమించునుగాక! దుర్గా! మాకు సహాయపడుము. శత్రువుల పారద్రోలుటకు మాహృదయములను శౌర్యముతో నింపుము!' దుర్గావతి యుత్తేజిత వాక్కులను విని రాజపుత్రులెల్లరు యుద్ధసన్నద్ధులైరి. ఎనిమిదివేల రౌతులును, పండ్రెండువేల సైనికులును స్వదేశరక్షణకై శత్రువుల నెదిరించిరి. దుర్గావతి సైన్యాధిపత్యమువహించెను. లోహకవచమును ధరించి శస్త్రధారిణియై దుర్గావతి యశ్వమునెక్కి సైన్యమును నడపినది. యుద్ధమారంభమయ్యెను. దుర్గావతి ప్రాణములపై ఆశవీడి శత్రుసైన్యముల భేదించివైచెను. ఆమె బల్లెపుపోటుచే యనేక తురుష్కసైనికులు హతులైరి. తిరిగి వచ్చునప్పుడు దుర్గావతి శత్రువ్యూహమునందు చిక్కుకొనెను. ఆమె భుజము తెగి రక్తము ప్రవహింప మొదలిడెను. ఆమెను రక్షింపబోయి రాజపుత్రులనేకులు సమరమున మడసిరి. తుదకు రక్తమయమగు దుర్గావతి శరీరమును రాజపుత్రులు శిబిరమునకు చేర్చిరి. అసోఫుఖాను దీని తెలిసికొని భ్రాంతచిత్తుడయ్యెను. ఆ భ్రాంతియే వాని పలాయనమునకు కారణమయ్యెను. రాజపుత్రుల ధాటి కాగలేక తురుష్కులు మాళవదేశమునకు పారిపోయిరి.

ఈ అపజయము నీచుడగు అసోఫుఖాన్ని క్రోధము నినుమడింపజేసినది. గఢామండలమును నాశనమొనర్పవలెనని పదునెనిమిది నెలలలో మహాసైన్యమును సేకరించుకొని తిరిగి దాడెత్తివచ్చెను. కాని యీసారియు రాజపుత్రుల ప్రతాపానలముచే తురుష్కసైన్యములు దహింపబడె

ను. ఆసోఫుఖానునకు 2-వసారి యపజయ ముసిద్ధించెను. యుద్ధభూమియందు దుర్గావతిని జయింపలేక అసోఫుఖాను కుతంత్రముల బన్న మొదలిడెను. తన గూఢచారులచే రాజపుత్ర సరదారులందు భేదములను కల్పించెను. రాణియందు ప్రజలకు ద్వేషభావముగలదని నీలివార్తల వ్యాపింపజేసెను. అప్పుడు మూడవసారి ఖాను మరల గఢామండలరాణి నెదుర్కొనెను. దుర్గావతి యిప్పుడు యదార్థమునకు అబలయైయుండెను. అయినను తన దేహమందు ప్రాణవాయువు ఉన్నంతవరకు తనరాజ్యము మొగలుల స్వాధీనము కానీయనని వీరరాజ్ఞి ప్రతిన బూనెను. యుద్ధము ఘోరరూపము దాల్చెను. దుర్గావతియు, పదునాలు గేండ్ల వీరేంద్రుడును యుద్ధభూమియందు శత్రువులదునుమాడుచుండిరి. యుద్ధముచేయుచు వీరేందుడు నేలకొరిగెను. మరి లేవలేదు. 'రాజ్ఞి! మరణఘాతనుతిన్న బాలుని తీసికొని శిబిరమునకు పోగూడదా? మా యంతటి వీరులుండగా యుద్ధరంగమున మీరుండవలెనా?' యని స్వామి భక్తుడగు రాజపుత్రు డొకడు దుర్గావతితో ననెను. దుర్గావతి గంభీరస్వరముతో 'నేను తిరిగి పోతినని తెలిసిన తక్షణమే మనసైన్యమును నిర్వీర్యతజెందును. వీరకుమారుడు క్షత్రియోచిత వీరస్వర్గమును పొందినచో నాకు చింతయేమి? యుద్ధము ముగియగనే నేనును నాపుత్రుని పరలోకమున కలసికొందు' ననెను.

దుర్గావతీ! నీవు ధన్యురాలవు. నీవు యుద్ధమందు చనిపోయినను గెలచిన రాణివే! శత్రుసేనాపరంపరలచే రాజపుత్రసైన్య మంత మొందసాగెను. ఒక బాణము రాణికంటిని గ్రుచ్చివైచెను. మరొకబాణ మామె హృదయమునందు తాకెను. బాణములు తీయుటతోడనే రక్తస్రావముచే యామె మూర్ఛనొందెను. ఆమె కూర్చుని యున్న గజమును శిబిరమునకు మరల్ప రాయాధు డొకడు ప్రయత్నించెను. తక్షణమే మూర్ఛనుండి దుర్గావతి లేచి 'నన్ను బ్రతికింప యత్నించుచున్నారా? నన్ను జీవముతో శిబిరమునకు గొంపోవలదు. ఎవరేని నాప్రాణముల నీదేహము నుండి వేరుజేయు'డని యస్ఫుటస్వరముతో ననెను. కాని యావీరమాత కోర్కె నంగీకరించు వారెవరు? తక్షణమే దుర్గావతి తన కైజారును తీసికొని తన పొట్ట యను యొరలో దూర్చివైచెను!

యుద్ధము సమాప్తమయ్యెను. రాజ్యము అసోఫుఖానుని వశమయ్యెను. క్షాత్రధర్మపరాయణి యగు ఆవీర నారీశిరోమణి పవిత్రదేహము శత్రువులఅపవిత్రహస్తములచే మలినము కాలేదు. తక్షణమే యనుచరులు అగ్నికుండమునుచేసి శాస్త్రోక్త విధిని సంస్కారములనుచేసిరి.

దుర్గావతి యీనశ్వరశరీరమును విడచి అవినశ్వర కీర్తిని పొందెను. ఈ వీరాంగనను గురించి కర్నల్ స్లీమెన్ యను పాశ్చాత్య ప్రముఖు డీవిధముగ వ్రాసెను. 'రణశూర,రాణి యగు దుర్గావతి స్మారకచిహ్నము పర్వతప్రదేశమధ్యమున కట్టబడెను. అచట రెండు పాషాణ స్తంభములు జంటగా నిలచియున్నవి. ఆదృశ్యము ప్రేక్షకుల మనస్సునందు పూర్వయుద్ధ చిత్రమును చిత్రితము చేయుచుండును. ఈగిరిశిఖరమున రాత్రివేళలందు రణఘోష వినవచ్చునని ప్రజలందురు. ప్రయాణీకు లీప్రదేశమందు సాగిపోవునపు డా వీరరాజ్ఞిని స్మరించుచు పరాక్రమపూరితహృదయు లయ్యెదరు. చుట్టుప్రక్కల దొరకు వివిధఫలములను ఏరుకొనిపోయి యాస్మారకచిహ్నమునకు సమర్పింతురు. మహారాణి దుర్గావతి దివ్యగుణముల నభినందించుచు ఫలము నొకదానిని నేనును అర్పించితిని.'

అసామాన్యశౌర్యము నెవరు పూజింపకుందురు?

శ్రీ కూచి నరసింహము పంతులుగారి సూక్తిశుక్తిజములు. ౬

[మొదటి ఐదు సూక్తిశుక్తిజములును
గత సంచికలో ప్రచురితములు.]

శ్లో. మూఢజహీహి ధనాగమతృష్ణాం
కురుసద్బుద్ధిం మనసి వితృష్ణామ్
యల్లభసే నిజకర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్.

(తెలుఁగు)

గీ. వెంగలీ! ధనతృష్ణను విడిచిపెట్టి
చిత్త మపగతతృష్ణంబు చేసికొనుము
స్వకృతకర్మఫలంబు గా వచ్చు విత్త
మున నె మనమున సుఖముండు తనివినొంది.

ఓ వివేకవిహీనుఁడా? ధనము రావలెనను దురాశ విడుచుకొనుము, బుద్ధిని ఆశారహితమైన సద్బుద్ధిని జేసికొనుము, నీవు చేసికొన్న కర్మముల వలనఁ బ్రాప్తించిన విత్తమునకే సంతృప్తుఁడవై సాహ్లాదచిత్తుఁడవై యుండుము—అని శ్రీమచ్ఛంకరాచార్య విరచిత భజగోవిందశ్లోకములలో నొకటియగు ఈ శ్లోకము మనకు బోధించుచున్నది.

"ఇది గృహస్థులకుఁ జేసిన యుపదేశముగాని సర్వసంగపరిత్యాగులగు సన్న్యాసులకుఁ జేసిన యుపదేశము కాదుగదా అట్టిచో, చిత్తములో నే కోరికయు లేకుండ, ఏపనియుఁ జేయకుండఁ గూరుచుండి పూర్వజన్మకర్మోపాత్తమైన విత్తములోఁ బరితుష్టి నొందియుండిన యెడల, సంసారశకట మెట్లు సాఁగును?" అను ధర్మసందేహము కలుగక మానదు.

విశ్వమందలి సర్వేతరపదార్థములవలెనే విత్తము మేలును, కీడునుగూడఁ జేయవచ్చును. సత్సాధనములచే సంపాదించుకొని సద్వినియోగము చేసికొను ధనము సమస్తశ్రేయోదాయకము, తనకును ఇతరులకును గూడ నుపయోగపడి దేహయాత్ర సుఖప్రదమగును. అన్యాయార్జితమైనట్టియు, దుర్వినియోగము చేయఁబడునట్టియు ధనముమాత్ర మనర్థకారియగును. స్వపోషణమునకును, స్వకుటుంబపోషణమునకును వలయు ద్రవ్యము యుక్తమార్గముల సంపాదించుకొనుట గృహస్థునకు ధర్మము. అట్లు చేయనివాఁడు విహితధర్మోల్లంఘనమునఁ గలుగు విపత్తుల పాలగును. అనఁగా, పరమేశ్వరుఁడు ప్రసాదించిన దేహబలబుద్ధిబలములు ఉచితధనార్జనమునకై యుపయోగింపక, త్రుప్పుపట్టిన పనిముట్టువలె పనికి మాలిన సోమరియై పడియుండి, భార్యాపుత్రాదులఁ గష్టపెట్టువాఁడు ఉభయలోకములకుఁగాక చెడిపోవునన్నమాట. 'కర్మోపాత్తం' అనఁగా ఇహపూర్వకర్మోపాత్తముగాని కేవల పూర్వకర్మోపాత్తముగా దని యెఱుఁగవలెను. శక్తివంచన లేకుండ యథాన్యాయముగా పాటుపడినను ఉద్దిష్టఫలము లభింపనప్పుడు, అది పూర్వకర్మదోషముగా నెంచి, దానికి డిల్లుపడి పోక, ధైర్యోత్సాహములతో నిలిచియుండువాఁడు అసంగుఁడు. అంతేకాని, ఇతరుల కాధారభూతమగు గృహస్థాశ్రమములోనుండియు, మహాతమోగ్రస్తుఁడై, తానే యితరులపై నాధారపడి వారికి భారభూతుఁడగు గృహస్థుఁ డసంగుఁడు కాఁడు. జనకధర్మవ్యాధాదు లట్టి యుద్దండులైన యసంగకర్మయోగులు, వారిదే నిజమైన యసంగానందము. స్వార్థపరతాకలుషితమైన సంకల్పముతోఁ గావించు కర్మములు బంధహేతువులుగాని కేవల పరహితేచ్ఛాప్రేరితమైన కర్మ మెంతచేసినను అది భవబంధహేతువు కానేరదు. ఇంత విపులసృష్టి చేసియును భగవంతుఁ డసంగసుఖియై యుండుట కిదియే రహస్యహేతువు. కనుక శ్లోకము బోధించు ధనాగమతృష్ణాత్యాగము, అనుచితధనాగమతృష్ణాత్యాగము మాత్రమే. సముచితవిత్తార్జనము చేయుటకు యావత్కష్టము పడినవానికే 'నీకు లభించిన విత్తముతో తుష్టిపొందుము' అని శ్లోకము చెప్పుచున్నది—ఇట్లు సందేహము నివర్తించుకొని మనము మనస్సమాధానము చేసికొనవచ్చును.

సూల్తాన్ రజియా

[౧౧౨-వ పేజీ తరువాయి]

వేశించి, నమాజులో నన్ను పట్టితివి. పిలుపని పేరంటముగా వచ్చి ప్రేలెదవేమి...?

అబ్దులుఆలి :

కాదు. స్త్రీలకు ఘోషా అవసరము లేదు ? మగరాయుడువలె ...నీవలె...మానము విడిచి తిరుగవలెనా—!

రజియా :

(కోపావేశమున – విరచుకొని అబ్దుల్ ఆలిపై పడబోవును. ఇనుప గొలుసులు తెగవు)–

అబ్దులుఆలి :

ఇంకా ఎందులకు నీకీ ఝుంకారములు! హిందూ, మహమ్మదీయ సఖ్యము ఏర్పరచిననాడు......అప్పుడు చూపెదవుగాని...

రజియా :

దానిలోని పరమార్థము నీబోటి స్వార్థపరుల కేమి తెలుసును...?

అబ్దులుఆలి :

అరేబియా, పర్షియా భాషలలో 'హిందూ' అనిన గులామ్ అని అర్థము. గులాములకును, యజమానులకు సఖ్యమా...? సమాన ఫాయియా...? కోయిలకు కాకికి సఖ్యమా...? మయూరములకు పాములకు సఖ్యమా...? సింహములకు ప్రుక్కడి మృగములకు సఖ్యమా! ధూ—నీకు మతిపోయినది.

రజియా :

కారుకూతలు మాను. నాదగ్గరా నీ శాస్త్రప్రలాపములు...? తొలుత అరేబియనులు, పర్షియనులు ఈ దేశమునకు వచ్చినపుడు– ఇచట ప్రచారములోనున్న 'హిందూ' పదమును విని, తమ భాషలోని పదమునకు సమన్వయము చేకూర్చికొని, ఈర్ష్యకొలది ఇచటి ప్రజలను గులాములనిరి. అంతే కాని వీరు గులాములు కారు. ఈ దేశములోని ఒక ప్రదేశమునకు 'హిందూ' అని పేరు. దానినిబట్టి ఈ దేశమునకు హిందూస్థానమని పేరు వచ్చినది. అందలి ప్రజలు హిందువులు. ఆ తీరున మనమంతా హిందువులమే. ఇదియా నీశాస్త్రపరిజ్ఞానము...?

అబ్దులుఆలి :

నాశాస్త్రజ్ఞానమున కేమి ... పరమ శత్రువును సహితము కామించి, కబురులంపు రాణుల పరిజ్ఞానమును చెప్పవలెను...!

రజియా :

బుద్ధిహీనుడా–! హింసాపూర్వక ప్రలాపములు మానుము

అబ్దులుఆలి :

సులైమను–! హే, హే, హే, అతడు నిన్ను విడిపించునా...? అతిడురాజు, నీవు రాణివా, నీవు రాజువు, అతిడు రాణియా కాదలచుకొన్నది మీరు...?

రజియా :

ఛీ– దుర్భాషలాడకుము. మా గాదిక్రింది పందికొక్కువు, దుర్మదాంధుడవు.

అబ్దులుఆలి :

ఇదిగో యీ మీసము ఢిల్లీ పాగుషాలకు భుక్తిని సంపాదించి పెట్టినది. నామంత్రిత్వ ఫలితమే యీ అపార రాజ్యము. ఆడుది, అబల, రాజ్యముచేయుచో నేను సహించగలనా— ? సులైమన్ నన్ను మార్కొనగలడా—! వెఱ్ఱి తలపుల బోతివా—!

రజియా :

పొంగిపోకుము. సులైమన్—! ఎంత సామాన్యుడవు! ఎంత వ్యక్తిత్వరహితజీవితము నీది! నాకు సాయపడవచ్చి, మాయమాటల లోబడి, దుష్టులను శిష్టులుగానమ్మి చెడలితివి.

ఓ, నీసాయము నా కవసరము లేదు. కాని...గాఢముగా అల్లుకొనిపోయిన తీగను ..నిర్దాక్షిణ్యముగా...త్రెంపివేయవలసి వచ్చినది ..ఛీ, ప్రపంచమే కళంకమయము.

అబ్దులుఆలి :

ఇక మూడుదినములకు అబ్దుల్ ఆలి ఢిల్లీ సింహాసన మెక్కనపుడు నీ పొంగు–!

[నిష్క్రమణ. తెర]

౧౩-వ రంగము

(కోటలో రహస్యమందిరము - అబ్దులుఆలి ఆలోచనానిమగ్నుడై యుండును- హుస్సేను ప్రవేశించి——)

హుస్సేన్ :

మంత్రిజీ-! మీ సలహాప్రకారము- రజియాను చంపివైచితిమని సుల్తానాతోను, రాంమోహిద్దీనుతోను చెప్పితిని. మొదట నమ్మలేదు. రుక్నుద్దీన్ స్వయముగా వచ్చి 'రజియాను శిరశ్ఛేదముచేసితిని-' అని వారిరువురతోను,సుల్తానాను ఈరోజున చంపబోవుచున్నామని రాంమోహిద్దీనుతో చెప్పెను.

సుల్తానా- 'హా' యని ప్రాణములు విడిచినది. రాంమోహిద్దీను ఉన్మాదుడాయెను. అతని ఉన్మాద ప్రలాపములను మేము ఆపలేకయున్నాము.

సుల్తానా రాంమోహిద్దీనులను ఖూనీచేసితిమని రజియాకు చెప్పితిని. 'వారు అమరులు. వారిది చావుకాదు.' అనినది రజియా.

అబ్దులుఆలి :

(భుజముపై చేయివైచి ప్రోత్సహించుచు)-

చక్కనిపని చేసితివి. హుస్సేను! హుషార్. ఇంకొకపని యున్నది. ఒక్క దెబ్బతో రెండు పక్షులు పడవలెను.

"రాంమోహిద్దీను చేసిన అవమానమును భరించలేక, కృశించి కృశించి సుల్తానా మృతిచెందినది"

అబ్దుల్ ఆలి——

ఇదిగో ఉత్తరము. దీనిపై రుక్నుద్దీను సంతకముకూడా చేయించుము. రుక్నుద్దీనుని సేవకుని వేషము వేసికొనుమనుము. ఈ ఉత్తరమును సులైమన్ దర్బారునకు ఖాదర్‌తో కలసి తీసికొని వెళ్లుమనుము. అచటి రహస్యములను రాకుమారులు స్వయముగా తెలిసికొనుట ప్రయోజనమనుము. అవసరము వచ్చిన సులైమనును జయించి ఆపదలేని ఢిల్లీసింహాసనమును రాకుమారులకు ఇవ్వ అబ్దులుఆలి ప్రయాసపడుచున్నాడని చెప్పుము. ఇది మిష.

జాబందించి, తిరిగి వచ్చు దారిలో రుక్నుద్దీనును పొడిచి చంపుమని ఖాదర్‌తో చెప్పుము.

(హుస్సేను స్తబ్ధుడగును) వెలవెలబోకుము. ఇంతకాలము నేనెట్లు మంత్రిత్వమునడిపితి ననుకొంటివి? అబ్దుల్ ఆలి రాజు అయినప్పుడు- అఖండ ప్రజ్ఞాశాలి హుస్సేను మంత్రి-

హుస్సేన్ :

(ధైర్యముతో) నాకేమియు భయములేదు. అటులనే చేయించుదును. మీ ఆజ్ఞ నాకు కురాను.

అబ్దులుఆలి :

నీవు ఈపని ముగించిన వెంటనే రజియావిషయము నేనుచూచెదను.

[నిష్క్రమణ-తొందరగా తెర]

౧౪-వ రంగము

(కోటలో అబ్దుల్ ఆలి——సేవకుడు ప్రవేశించి)-

సేవకుడు :

మహామంత్రులకు సలాం. రజియాకుమారి తప్పించుకొనినది. కాపలావారు గస్తీ తిరుగుచునే యున్నారు.

అబ్దులుఆలి :

(క్రుద్ధుడై)- తప్పించుకొనిపోయినది...! ఆఁ, అర్థమైనది పహరా సైనికులు ఎంతపని చేసిరి!! వారిని చిత్రవధ చేయవలసినదే.

శీఘ్రముగా పోయి హుస్సేనును రమ్మనుము.

[తెర]

౧౫-వ రంగము

(కోటలో అబ్దులుఆలి- హుస్సేను ప్రవేశించును)-

అబ్దులుఆలి :

(ఎఱ్ఱబారిన మోముతో, నిప్పులగ్రక్కు కన్నులతో—).

ప్రయత్నము అంతయు వ్యర్థమైపోయినది. పహరావారిని చిత్రవధ చేయుము.

హుస్సేన్:

పహరావారిని చిత్రవధ చేయించితిని. నౌఖర్ ఈవార్త నాకు చెప్పినవెంటనే చేసినపని అదియే.

అబ్దులుఆలి :

(ఆవేగముతో)- నాప్రయత్నము లెప్పుడును ఇంత నిష్ఫలమో

జనములు కాలేను రజియా నిద్రపోదు. అసమానప్రజ్ఞ కలది. ఆమె నెమకొన్న మన వశము కాదు ఇక.

హుస్సేన్ :

మీరు చింత చెంద నవసరము లేదు. రుక్నుద్దీనును ఖాదర్ హత్య చేసినవార్త ఇంతకుముందే నాకందినది. సుల్తానా చనిపోయినది. రాంమోహిద్దీను ఉన్మాదుడాయెను. ఇక మిగిలినది భగ్నహృదయ రజియా. సుల్తైమనుతో నేస్తము కోరదు. ఖైదులోనున్న సమయములో అతని వియోగాతురు దూషించిన సంగతి మీకు విశదము. అతనిపై ఆమెకు విరక్తి దోచినది. రజియా మనలనేమియు చేయజాలదు...

అయితే—ప్రజలు— హిందువులు, మహమ్మదీయులు— స్త్రీలు— పురుషులు...తుకతుక ఉడికిపోవుచున్నారు.. అగ్నిగుండములో వారు నడచుచున్నారు...అగ్ని పర్వతమునుండి ఉబికి పైకెగయు భీకర గంధమురీతి...వారి హృదయములనుండి కరుణవారి— వదలిపోయి ...భయంకరమగు వేడిసెగలను బయటికి వదలుచున్నది...ప్రజలను చూడలేము...పలుకరించలేము.

(పెద్దధ్వనిని వినినట్లు అభినయించి)— అదిగో ప్రజలు తిరుగుబాటుచేసినట్లున్నది. బందిఖానా వైపునకు బోవుచున్నారు. రజియా లేదని తెలిసికొని కోటలో ప్రవేశింతురు.

అబ్దులుఆలి.

తలక్రిందైనది యెత్తు ఇప్పుడు ఆత్మరక్షణ అవసరము. వెంటనే వెడలిపోయి ఆ ఉన్మాదుని కనుగ్రుడ్లు లాగించివేయుము. అటుపై ఆత్మరక్షణము చేసికొనుము. నేనును అందులకై త్వరపడెదను.

[తెర-తొందరగా.]

౧౬-వ రంగము

(అరణ్యములో నొక చెట్టు క్రింద— ఒక స్త్రీ— కృశించిన శరీరముతో— తొలగిన ఉత్తేజముతో— వాడిన మోముతో)

స్త్రీ :

(కొన్ని పండ్లను, కందమూలములను తినుచుండును. ఒకగొల్ల, వాని భార్య పాలను తీసికొని దారిని పోవుచు స్త్రీని సమీపించుదురు)

ఎవరో యిటువచ్చుచున్నారు. నన్ను వదలరు ఆక్రూరులు— వేషములు మార్చుకొని వచ్చుచుండవచ్చును. (తన వేషమును సరిచేసికొని, ఖడ్గమును దగ్గరకుతీసికొనును).

గొల్లవాండ్రు :

ఎవరమ్మా నీవు. ఒంటరిగా నుంటివి..?

స్త్రీ :

బాటసారిని. ఈ సమీపమందుగల గ్రామమునకు పోవలెను.

(శత్రువులు కారని గుర్తించి) నాకు దాహమగుచున్నది. మీ యొద్ద నీరుకలదా...?

గొల్లస్త్రీ :

పాలుగలవు. త్రాగుము. దానధర్మాలు లేకుండా కట్టుకొని పోదుమా? (అని ఇవ్వబోవును).

స్త్రీ :

(వారించి)— నాకు పాలుత్రాగు అలవాటులేదు. నాకు పాలువలదు. ప్రొద్దు క్రుంకుచున్నది మీరు వెడలిపొండి—

(గొల్లవాండ్రు వెడలి పోవుదురు.)

చక్కని ధర్మబుద్ధిగల జానపదులు వీరు

నేను పాలుత్రాగగలనా...? సుల్తానా గతించినది. రాంమోహిద్దీను పరలోకగతుడు. హా—! ఎంత క్రూరము. ఆక్రూరుల చేతులలోబడి నాప్రజ లెంత నరకకూపమును అనుభవించుచున్నారోగద—? ప్రజలకు నేను చేకూర్చినది నరకము, రౌరవము, దానిని భరించలేరు నాప్రజలు. కూడు, గుడ్డ లేక ఎంతమంది పరితపించుచున్నారో! ఎంతమంది చిత్రవధ లనుభవించుచున్నారో—?

తలపెట్టిన కార్యకలాపమంతియు బూడిదబోసిన పన్నీరైనది. ఇక నా ప్రజలకు మోక్షము లేదా...?

మతముపేరు చెప్పి, దేవునిపేరు చెప్పి— స్వార్థపరులు— హృదయమును చంపుకొని— దేశమును అల్లకల్లోలము చేయుచున్నారు. రజియా—! ఇక నీకీ ప్రపంచములో తావులేదు. నీకీమారు రూప

మేల.. ? జీవితముపై ఆశకలదా ...? నీ జీవిత మెవ్వరికిని వినియోగపడదు.

(వేషమును తొలగించి, నిజ రూపమున నిలబడి- కత్తినిచేబట్టి) ఎన్నిదినములు భీకరారణ్యములో శుష్కజీవితమును గడపగలవు ..? అవును భరించలేను.

దుష్టులనుండి తప్పించుకొంటిని. స్వేచ్ఛగా నాచావు నేను చచ్చెదను

(కత్తియెత్తిపొడుచుకొనబోయి.)

ఈవిధముగా నేను చావరాదు. నా యీశరీరము దివ్య భారత మాత. 'ఛీ-' యీ తుచ్ఛశరీరమునకు అంతటి భాగ్యమా...?

(నిదానించి)-

ఏల కాకూడదు మావద్భారతభూమిని నేనే ఇందలి సర్వమానవులు నా ప్రజలు. ఆప్రజలు రెండుజాతులే- స్త్రీలు- పురుషులు. నాశాహువులలో నొకటి పురుష చిహ్నము. రెండవది స్త్రీచిహ్నము. ఈ జాతులకు ఇవి మూల విరాట్టులు. ఈబాహువులతో నీ తనువును ఖూనీచేయరాదు.

అట్లుచేయుట ద్రోహము ... ద్రోహము—(ఉద్రేకము చెంది). కత్తిని చెట్టులో దిగవైచి-

ఇది పద్ధతి. ఇందు దోషము లేదు. హిందూస్థాన్ నాది. హిందూస్థాన్ నేను. భారతజాతిని ఉద్ధరించలేని రజియా- మృత్యువును అనుభవించవలెను. అమరజీవి కాలేను. భయంకరమైన కోత తను అనుభవించుటే యీ జీవితమునకు పావనము-

(అని పలుకుచు చెట్టును గ్రుద్దుకొనును. కత్తి యెదలో దిగి, రజియా ప్రాణములు విడుచును- కాని శవము క్రిందపడదు. కొంత వేసినట్లు చెట్టును అంటుకొని యుండును— ప్రభాకలితమైన గొప్ప వెలుతురొకటి రజియానుండి వెలువడి, ఆకాశపథమున ప్రయాణము చేయును)-

[తెర - తొందరగా]

కడుపుకోత

[ఇందులో స్ఫురించే తదితర విషయాలకన్న మాతృప్రేమనే విశేషంగా గ్రహించాలి. పసికందువుల బాసినందుకు కడుపు దుఃఖము మాతకే ఎక్కువ! ఇందు, ద్రౌపది అశ్వత్థామచేచంపబడిన తన పుత్రులకై విలపించు ఘట్టము గైకొనబడినది.]

ఏపాప మెఱుగనీ
ఏమర్మ మెఱుగనీ
నాముద్దు నాకన్న
పసివారి పొట్టకొంటివే
వోరయ్య
పండితాపుత్రుడనిపించితే-

నిశిరాత్రులందు నా
నిద్రింపు వేళలా
నాముద్దులంగాను
పసివారి .. ..'

పాలమిసిమిన్చోలి
పండుటాకులమించు
పసిమితో చెన్నారు
పసివారి .....॥

అస్త్రశస్త్రాలనూ
అభ్యసించాలేక
అనిమొనకురాలేని
పసివారి .. ..॥

కరకుకత్తులనైన
కరుణతో కరగించు
కల్యాణమూర్తులా
పసివారి......॥

ఇనుపముక్కలకన్న
గునుపరాతులకన్న
పనికిమాలు చు నీవు
పసివారి......॥

గురుశిష్యన్యాయాన్ని
పరికింపకే నీవు
పుంస్త్వమే చూపుమా
పసివారి......॥

పురుషత్వమేముంది ?
పరమార్థమే మొచ్చె?
పరహాలమూటలా
పలివారి......॥

నీకేమిచేసిరో
నిన్నేమి కూసిరో
నిష్కారణంబుగా
పసివారి పొట్టకొంటివే
వోరయ్య
పండితాపుత్రు డనిపించితే !

—పిల్లలమఱ్ఱి వేంకటహనుమంతరావు.

వెన్నెల పాటలు

మళ్ళీ రాపోతేను
మా చెల్లెలాతోడు
భోజనంబులుచేశి
మళ్ళీ వస్తాను
మళ్ళీ రాపోతేను
మా అన్న అర్జునుతోడు ౧౬
ఆమాట విన్నాడు
చెంగులొదిలేశాడు ౧౭
యింటివద్దకు వెళ్ళి
తలను వాలేశెనే ౧౮
పాపరావే పాప
నానల్ల పాపా
యీడు జోడులవారు
నిన్నేమి నన్నారు ౧౯
యీడు జోడులవారు
నన్నే మననులేరు
మనఅమ్మ తమ్మోడంట
మన మేనమామంట
ఢిల్లి ఢిల్లీనుంచి
దేవగిరీ నుంచి
మంచమేశిన పాప
మళ్ళీరాబోతేను
కుంచుల్ల కొంగొట్టి
కూర్చుండబెట్టేనే
పయ్యాద కొంగొట్టి
ప్రక్క కూర్చోబెట్టి
ఎవరితోడనినమా
వదిలినాడూ కాదూ
పిల్లులికి పాల్పోశి
మళ్ళీవస్తానంటె
ఒదలవోయి ఓమామ
నాచెంగు వదలవోయి
కుక్కలికి కూడోశి

౧౦౮-వ పేజీ తరువాయి.

మళ్ళీ వస్తాను
మళ్ళీ రాపోతేను
మా అన్న అర్జునతోడు
నీతోడు అంటేను
కొంగు లొదిలేశేను ౨౦
చెల్లెలన్నామాట
అన్న లాలాకించి
పాపమాటాలించి
భీమన్న ఆలాకించి ౨౧
పాప కాటికలన్ని
భీమన్నా బెట్టినే
పాపబొట్టులన్ని
భీమన్న బెట్టెనే
పాపగాజూలన్ని,
భీమన్నా పెట్టెనే
పాప వడ్డానగలు
వాళ్ళన్న ఫుంచూకునే
పాప బట్టాలన్ని
వాళ్ళన్న కిట్టెనే
పాప గాజూలన్ని
వాళ్ళన్న తొడుగుకూనె
పాప ఫుంగిరములు
వాళ్ళన్న ఫుంచుకునే
పాప మట్టేలన్ని
భీమన్న పెట్టుకుని
పాప ముడిచినకొప్పు
వాళ్ళన్న ముడుచుకూనే
పాప దొడిగిన రవికె
వాళ్ళన్న దొడిగె
నిండు నూరాకత్తి
చేతబట్టుకూనే ౨౨
మామ ఓయిమామ
మముగన్న మామా
తలుపుతియ్యి మామ
నీవుతియ్యావోయి ౨౩
పాపమాటలు కావు
భీమన్నా మాటలు
భీముడానుకాను
పాపనీ ఔదునోయి
నమ్మకపోతే ఓయిమామ
నాకాటుక చూడవోయి
పాప మాటలుకావు
భీమన్నామాటలు
నమ్మకపోతే ఓయిమామ
నాబొట్టు చూడావోయి
నమ్మకపోతే ఒయిమామ
నాగాజులు చూడవోయి
పాప మాటలుగావు
భీమన్నా మాటలు
భీమన్న కానోయి
పాపనోయి ఓమామ
నమ్మకపోతే ఓయిమామ
నాకోక చూడవోయి
పాపమాటలుగావు
భీమన్నామాటలు
నమ్మకపోతే ఓయిమామ
నాముట్టెలే చూడవోయి
పాప మాటలుగావు
భీమన్నమాటలే ౨౪
వెన్ను విప్పావుకూని
యింట్లోకి దిగినాడే
గుండెమీద గూర్చోని
కత్తిచే బూనెనే
కత్తి చేతనుబూని
ఒక్క వేటున వేశె
మామ నెత్తురులన్ని
యేరులై పారెనే
వారిమామ నెత్తురులూ
కాళ్ళవలై పారెనే ౨౫

* * *

నోమి నోమల్లార
నోమన్నలారా
దొడ్డదీ దేశమూ
అది మన్నె దేశమూ
రాజ్యంబు ఏలెనూ
రాముడే ఆరాజు
దేశంబు లేలేనూ
దేవుడే ఆరాజు ౨౬
ఆలిమీద ఆరాజు
ఆశలే పుట్టేయి
పెండ్లీయూదా రాజు
ప్రేమలే పుట్టేయి ౨౭
ఇల్లాలు లేనిల్లు
ఇటికెగుళ్ళాబోలు
పురుషుడు లేనిల్లు
పులుల పొద యనవచ్చు
బాలల్లూ లేనిల్లు
బ్రంహ్మపట్నము బోలు ౨౮
పైనంబులై నాడు
పట్నంపు రాజేమి ౨౯
షీకాయపుల్సులే
శిరసుకీ మర్దనలూ
తలయార స్నానాలు
ఆరాజు చేసెనే
సంపెంగ నూనెలే
చంపలకు రాసెనే
బంగారు పన్నెలతో
పాపిటలు దిద్దెనే
నున్నగను తలదువ్వి
నూనెముళ్ళేశెనే
జారుగా ముళ్ళేశి
జట్టుముడి వేశెనే
కొప్పు నున్నగదువ్వి

కొప్పుపై దిగనాడి
వ్రేళ్ళ వుంగారములు
ఆముద్దు టుంగరము
కాయ పంచలచాపు
కట్టుకున్నారే
సిందువర సూరకత్తి
మొలను తగిలించెనే
బంగారు వరకత్తి
బాకు మొలనే శెనే
చుట్టెనే తలపాగ
సూర్యుండు మెచ్చగా ౩౦
రాజెక్కు అంబారి
ఏనుగా ముస్తాబు
ఏనుగుకి ముస్తాబు
ఏమేమి చేసేరే
నాల్గుకాళ్ళకి నాల్గు
గజ్జెలే కట్టేరు
తొండమును దండాకు
గుత్తులే గుచ్చేరు
వుద్దాన్ని వలగజ్జె
పేరులే వేసేరు
వీపు వింజామరలు
వివరముగ వేసేరు
బొడ్డునా భోగపతి
గంటలే కట్టేరు
రెండుకొమ్ముల రెండు
దివిటీలు కట్టేరు ౩౧
ఏనుగను ఎక్కెనే
పట్నంపు రాజేమి ౩౨
వుల్లి తోటలుదాటి
పూళ్ళన్ని దాటెనే
పసుపుతోటలు దాటి
పట్నములు దాటెనే
చెరుకుతోటలు దాటి
చేలన్ని దాటెనే
ఘనముగా పండేటి
గంటిచేనుదాటెనే
ఘనముగా పండేటి
ఘల్లిచేను దాటెనే
సొగసుగా పండేటి
చోడిచేను దాటెనే
ఎర్రంగ పండేటి
ఎర్ర గులివిందలే
వరుసగా వుండేటి
వరిపొలము దాటెనే
ఏనుగులు మేసేటి
ఏనెపల్లె దాటెనే
గుర్రాలు మేసేటి
గుజ్జంగి దాటెనే
దబ్బతోటలుదాటి
దానిమ్మలేదాటి
నిమ్మతోటలుదాటి
అవి నారింతోటలే
గోరుగు గుడ్డెలుదాటి
గోదావరులు దాటి
ప్రియముగా అమ్మేటి
పిప్పళ్లదాటెనే
గురివిందలే దాటి
గోరింటలే దాటి
కాకుల్లు దూరని
కారడవిదాటెనే
చీమల్లు దూరని
చిట్టడివి దాటెనే
పాముల్లు దూరన్ని
పాలడవి దాటెనే
గెద్దగోరింటడవి
పెద్దడవి దాటెనే
అడవులూ గంధాలు
అవికొన్ని దాటెనే
కొండలు కులగిరులు
కొంతవరకూ దాటె
పసుపుతోటలు దాటి
పట్నములకొచ్చెనే
అరటితోటలు దాటి
అందెనూ పట్నములు ౩౩
చిన్న వీధులుతిరిగి
పెద్ద వీధులుతిరిగి
అన్ని వీధులుతిరిగి
అందముగు వీధులే
సంసారి వీధులికి
సాని వీధులకెళ్లి ౩౪
ఏడుగురు సానులే
ఏకమై పాడునురు
సానులను చూచెనే
అంబారి దిగినాడు
అంతలో పెదసాని
రాజువద్దకు వచ్చి ౩౫
ఏదేశము మీది
ఏరాజ్యము మీది
ఎటునుంచి వచ్చేరు
ఏమిపని కొచ్చేరు ౩౬
దొడ్డదీ దేశమే
అది మన్నె దేశమే
పెండ్లిమీదను నాకు
ప్రేమలే గల్గేను
ఆలిమీదను నాకు
ఆశలే గల్గేను
ఇల్లాలు లేనిల్లు
ఇటికిగుళ్లాబోలు
పురుషుడూ లేనిల్లు
పులులపొద యనవచ్చు
బాలల్లూ లేనిల్లూ
బ్రంహ్మపట్నము బోలు
చిన్నవారలు లేక
చింతనొందీనానే ౩౭
పెండ్లి పెద్దలు లేని
పెండ్లిండ్లు అవుతవా
కాలు మట్టెలు లేని
కాంతలూ ఎవరయ్యా
బాసికము గట్టుటకు
బ్రాంహ్మణుడను నేనూ
దేశంబు లేలనూ
దేవుడను నేనయ్యా
రాజ్యంబు లేలనూ
రాముడను నేనయ్యా ౩౮
ఆమాట విన్నాడు
చెయిబట్టుకున్నాడు
చెయ్యి బట్టూకూని
చింత దీరూకూనె
ముఖమువంకా జూచి
ముద్దు బెట్టూకూనె
సతిపతియు గలసెనే
సంతోషముగ నుండె
అంబారిపై నెక్కి
అవుడు వెంచేసెనే ౩౯

* * *

నోమి నోమల్లార
నోమన్నలారా
వెలమ దేశమునుంచి
వెలమ రాజూవచ్చె
మన్నె దేశమునుండి
మన్నె రాజూ వచ్చె ౪౦
ఉంగరాల సాలల్లో
బొంగరాలాడేరు
ఆడిన రాజులూ
ఆలిమీ దాడేరు ౪౧
గిరిదీసి గిరిలోను
బొంగరాల్వెట్టేరు
మన్నె రాజు బొంగరము
గిరిమీద పడ్డాది

వెలమరాజు బొంగరము
అంతరాన్ని తిరిగింది ౪౦
తేవయ్య మనిరాజు
తెమ్మినీ ఆలినీ ౪౩
నిబ్బరాపోయ్యేవు
నిలువు నీరై పోయి
చమురుమీద మన్నెరాజు
చతికిళ్ళ బడ్డాడు
మన్నిరా జప్పుడూ
మరియింటి కెళ్లేను ౪౪
వాకిటను వారమ్మ
వడ్లెండ బెట్టింది
వడ్లవద్ద వారమ్మ
కాపులే వున్నాది ౪౫
యింటికీ మన్నిరాజు
రాక వెళ్ళిపోయే ౪౬
వెలమ పిల్లల్లార
వెలమ బాబుల్లార
మీరంద రొచ్చేరు
మన్నిరాజూ యేడి ౪౭
అన్యకారి మన్నిరాజు
వాడ రిపోనూ
పాపకారి మన్నిరాజు
వాడు పాడై పోను
వెలమ దేశమునుంచి
వెలమరా జొచ్చెనే
మన్నె దేశమునుంచి
మన్నెరాజూ వచ్చె
ఉంగరాల సాలల్లో
బొంగరా లాడేరు
ఆడినా రాడక
ఆలిమీా దాడేరు
భూము లాడరాదా
తోట లాడారాదా
తోటలాడకపోతే

కోట లాడారాదా
అన్యకారి మన్నిరాజు
ఆలి నోడీనాడే ౪౮
ఆనాటి విన్నాది
తల్లి శోకించింది ౪౯
వుంటుండి గంగమ్మ
వాకళ్ళ కొచ్చింది
అత్తరో మాయత్త
ఉత్తమావు కన్నరో
ఊరకే మాయత్త
ఊరవ శోకిస్తావు ౫౦
కోడలా గంగమ్మ
కోవలీ వినుమమ్మ
వెలమరాజు మన్నిరాజు
బొంగరా లాడేరు
వెలమరాజు బొంగరము
అంతరా న్నాడింది
మన్నిరాజు బొంగరము
మధ్యనే పడ్డాది
బొంగరము లాటకూ
నిన్ను ఓడిపోయే ౫౧
ఆపాటి మాత్రమున
అరవ శోకించెదవా
ఏడువకు ఏడువకు
ఏడువకు మాయత్త ౫౨
మన్నిరాజు బండెక్కి
మరి బయలు దేరింది ౫౩
వుల్లితోటలు దాటి
వూళ్ళన్ని దాటెనే
సొగసుగా పండేటి
చోడిచేనూ దాటె
ఘనముగా పండేటి
గంటిచేనూ దాటె
వరుసగా పండేటి
వరిచేను దాటెనే

గుజ్జుగా పండేటి
గుజ్జంగి దాటెనే
ప్రియముగా గోరి కేటి
పిప్పళ్లు దాటెనే
యమ్రంగ పండేటి
గురివింద దాటెనే
పిచ్చికలు దూరని
పీచడవి దాటెనే
కాకుల్లు దూరని
కాగిడవి దాటెనే
గెద్దల్లూ దూరనీ
పెద్దడవి దాటెనే
ఏనుగులు మేసేటి
వెంపళ్లు దాటెనే
పనసతోటలు దాటి
పట్నాలు కొచ్చింది
ఆపట్న మందూన
గంగనే దించేను ౫౪
ఆకలీ అవుతుందే
అన్నములు పెట్టవే ౫౫
బండివాని మాటలే
బాల ఆలించింది ౫౬
ముతకసరి బియ్యములు
మూడడ్లు కడిగింది
ఆకుసరి బియ్యములు
ఆరడ్లు కడిగింది
సన్నసరి బియ్యములు
చాలగా కడిగిందీ
అల్లాడు రువ్వల్లు
అగ్ని రా దేశింది
ఉల్లితొరలావంటి
ఊకపై బోశింది
నేరేడు పండొంటి
నీలాలు పోశింది
ఉడుకొచ్చె అన్నములు

ఉల్లిపొరలా ఛాయ
కాగనే అన్నములు
కలవపువ్వుల ఛాయ
పొంగొచ్చె అన్నములు
పొన్నపువ్వుల ఛాయ
మల్లెల్ల గరిటెలతో
మెల్లంగ చూచింది
పొయిలపై అన్నములు
మెల్లగా దించెనే
జాజూలా సిబ్బేసి
జల్లునా వార్చెనే ౫౭
అంతరాన్ని పాకేటి
కాకినీ చూచింది
మావారికీ చిన్న
కబురు చెపుతావటవే
నడచేటి కాళ్ళకీ
అందె వేయిస్తాను
పాకేటి రెక్కలకు
పచ్చ లేయిస్తానే
కాకిమూతికి రేకు
లేఖలే కట్టింది
నివెళ్లే త్రోవలో
పాలసత్రము గలదు
పాలసత్రము వద్ద
నిలువకుము నిలువకుము
నీవెళ్ళే త్రోవల్లో
జామితోటా వుంది
జామితోటలు వద్దా
జాముండ బోకమ్మా
మాఅమ్మ చెరగేటి
చేటపై వాలుగూ
మాబాబు దున్నేటి
దుక్కిపై వాలుగూ
మావదిన వండేటి
వంటపై వాలుగూ

నా అన్న చదివేటి
చదురుపై వాలుమాగిర
దున్నేటి వారి బాబు
దుక్కిపై వాలెనే
కాకి మెడనూ రెండు
లేఖలూ విప్పేనే
కొడుకురా ఓకొడుకారా
ననుగన్న కొడుకా
గంగ లేఖల్లాగ
వున్నాయి చదువుమాగిర
బాబురా ఓ బాబు
మముగన్న తండ్రీ
యికనేమి వున్నాది
మనరథము క్రుంగింది
యికనేమి వున్నాది
జగము యేమున్నాది
వెలమరాజు మన్నెరాజు
బొంగరాలాడేరు
బొంగరాలాటకీ
గంగ నిచ్చేశేరు ౬౧
నీళ్లు త్రాగాకుండ
నిలవకుండా వెళ్లె
పాలు ద్రాగాకుండ
పరుగెత్తి వెళ్ళెనే
వెన్న దినాకుండ
వెను జూడకను వెళ్ళే
కూడు దినాకుండ
కూర్చోక వెళ్ళె
నలుగురూ అన్నల్లు
లఘువుమీాదా వెళ్ళే ౬౧
గంగినూ తెచ్చెనే
ఒక ఇంటిలో వుంచె ౬౨
ఓరోరి మంగలీ
ఇంటిగల మంగలీ

పండుగకు మన్నిరాజు
రమ్మనమని చెప్పె ౬౩
అప్పుడే వెళ్ళేడు
మన్నిరాజు వూరికీ ౬౪
అల్లంత దూరమున
మంగలిని జూచెనే
అమ్మగో నా అమ్మ
మముగన్న తల్లిగో
అత్తవారి వూర్నించి
మనిషి వస్తున్నాడు
గంగ నడుగూతారు
ఏమేమి చెప్పుదునె ౬౫
కొడుకురా ఓకొడుక
ననుగన్న కొడుకా
గాలివానవచ్చి
గంగెళ్ళిపోయింది
యిటువంటి పల్కులూ
బొంకురా ఓకొడుక ౬౬
ఓరోరి మంగలీ
ఏల వచ్చినావూ ౬౭
అత్తవారి వూరిలో
పండుగలు దెచ్చేరు
గంగనీ మిమ్మల్ని
కలసి రమ్మన్నారు ౬౮
మూడు వేళ్ళ భటువులూ
ముద్దు టుంగరములూ
అయిదు వేళ్ళకి అయిదు
ఆనందముగ బెట్టె
సంపంగినూనెలే
చంపలకి వ్రాశెనే
బంగారు పన్నెలతో
పాపిట్లు దిద్దెనే
సున్నగా తలదువ్వి
నూనె ముళ్లేశెనే

చదురుగా తలదువ్వి
జారుముళ్లేశెనే
కొప్పు సున్నగ దువ్వి
కొప్పు దిగనాడెనే
కొప్పుపై బంగారు
గుప్పు దిగనాడెనే
చుట్టేడు తలపాగ
సూర్యుండు మెచ్చంగ
పెట్టేడు తిరుమణీ
పేడివ్వ కుండగను
చేతికీ విలువైన
కడియములూ వేశెనే
కాయ పంచలజోడు
కట్టుకున్నాడే
పగడాలు చెప్పుజోడు
కాలికి తొడిగెనే.
ముత్యాలు మునకాలు
ముంజేతి బట్టెనే ౬౯
అరటితోటలు దాటి
అందుకొనె పట్నాలు ౭౦
అల్లంతదూరమున
బావమరుదులు జూచె
మీారొక్కరొచ్చేరు
గంగ రాలేదేమి ౭౧
గాలివానలు వచ్చి
గంగెళ్ళి పోయింది
గాడుపులే వచ్చి
గంగెళ్ళి పోయింది ౭౨
పాలోశి వారికత్తి
పదును పట్టించేరు
నూనోశి వారికత్తి
సున్నంగ నూరేరూ
నెయిబోశి వారికత్తి
నేర్పుగా నూరేరు

బంగారు కత్తులే
మొలను దోపీనారు ౭౩
పూలతోటల్లోను
బావితీయించేము
బావినూచొద్దాము
బయలుదేరు మనే ౭౪
నలుగురూ అన్నల్లూ
వెనుకనూ వున్నారూ
మన్నిరా జొక్కడిని
ముందు నడిపించెదరు ౭౫
అప్పు డేమన్నాది
గంగ అన్నలతోను ౭౬
అన్నరో మాయన్న
నలుగు రన్నల్లార
నాచేతి గాజులూ
చెల్లగొడతారా
నాకళ్ళ కాటుకలు
కారగొడతారా
నానొష్ఠ కుంఖములు
నేల గల్పూతారా
అన్నలారా రండి
మా అన్నలారా ౭౭
మానలుగ రన్నలది
నాలుగూ వంతులే
చెల్లెలా గంగమ్మ
నీది అంతావంతె ౭౮
వెధవ చేతులతోను
ఏలాగు వుందునే ౭౯
ఆమాట విన్నారు
తిరిగి వచ్చినారు ౮౦
మన్నిరాజు వూరికీ
నాడె వెళ్ళిపోయె
నోమి నోమల్లార
నోమన్నలారా ౮౧

Printed at the Andhrabhumi Printing Works, 36 Mukatal Street. Vepery P.O, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B A.